APTEL/2009/29308

స్నేహిత

# ఎక్స్‌ప్రెస్

నిజం దాగదు.. వార్త ఆగదు

తెలుగు దినపత్రిక

బుధవారం 08-01- 2025

సంపుటి : 16 | సంచిక : 63 | ఎడిటర్: రాథోడ్ వినోద్ కుమార్ | పేజీలు : 5 | వెల : రూ. 4

epaper.expresstelugudaily.com

## ఆశారాం బాపుకు మధ్యంతర బెయిల్ మంజూరు



**న్యూఢిల్లీ, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** ఆధ్యాత్మిక గురువు ఆశారాం బాపుకు సుప్రీంకోర్టు మంగళవారం మధ్యంతర బెయిల్ మంజూరీ చేసింది. ఆరోగ్యం క్షీణిస్తున్న నేపథ్యంలో మార్చి 31వ తేదీ వరకు ఆయనకు బెయిల్ ఇచ్చారు. మెడికల్ గ్రౌండ్స్ మీద 86 ఏళ్ల ఆశారాం బాపుకు బెయిల్ ఇస్తున్నట్లు కోర్టు తెలిపింది. జస్టిస్ ఎంఎం సుంద్రేశ్, జస్టిస్ రాజేశ్ బిందాల్‌తో కూడిన ధర్మాసనం ఈ ఆదేశాలను పాస్ చేసింది. ఆశారాం బాపు తరపున సీనియర్ న్యాయవాది దేవదత్త కమాత్ వాదించారు. ఆయనతో పాటు అడ్వకేట్లు రాజేశ్ గులాబ్ ఇనాందార్, శాశ్వత్ ఆనంద్ కూడా ఉన్నారు. ఆశారాం బాపు అసలు పేరు అసుమల్ సిరుమలాని హర్పలని. జోద్‌పూర్‌లోని అతన ఆశ్రమంలో ఓ టీనేజ్ అమ్మాయిని రేప్ చేసిన ఘటనలో అతన్ని అరెస్టు చేశారు. జోద్‌పూర్ కేసులో బెయిల్ దొరికినా.. మరో రేప్ కేసులో అతని పేరు ఉన్న కారణంగా ఇప్పుడే అతను జైలు విడిచి బయటకు రాలేరు. 2013లో గుజరాత్‌లోని గాంధీనగర్‌లో ఓ మహిళను కూడా లైంగికంగా వేధించినట్లు ఆశారాంపై ఆరోపణలు ఉన్నాయి.

## యూత్ కాంగ్రెస్ దాడి దుర్మార్గం

తీరుమార్చుకోకుంటే పరిస్థితులు తీవ్రం

హెచ్చరించిన కేంద్రమంత్రి కిషన్ రెడ్డి



2లో

## నేడు విశాఖకు ప్రధాని మోడీ

ఏర్పాట్లను పరిశీలించిన పురంధేశ్వరి

విశాఖ స్టీల్ ప్లాంట్‌కు ప్యాకేజీ వస్తుందని ఆశాభావం



2లో

## కాంగ్రెస్ దాడిని ఖండించిన బిజెపి నేతలు

తలచకుంటే గాంధీభవన్ పునాదులు ఉండవు

ఘాటుగా హెచ్చరించిన బండి, ఏలేటి, ధర్మపురి



2లో



## బిఆర్ఎస్ ఎమ్మెల్యే కెటిఆర్‌కు

# హైకోర్టు షాక్

### ఎసిబి కేసులో క్వాష్ పిటిషన్ కొట్టివేత

- విచారణకు ఎసిబికి అనుమతించిన హైకోర్టు
- కెటిఆర్‌కు ఇడి మరోమారు నోటీసులు
- 16న విచారణకు రావాలని ఆదేశం




హైదరాబాద్, స్నేహిత ఎక్స్‌ప్రెస్:

భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్‌కు హైకోర్టులో చుక్కెదురైంది. ఆయన దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌ను ఉన్నత న్యాయస్థానం కొట్టివేసింది. ఫార్ములా ఈ-రేసు వ్యవహారంలో ఏసీబీ నమోదు చేసిన కేసును కొట్టివేయాలంటూ కేటీఆర్ పిటిషన్ దాఖలు చేశారు. గత నెల 31న ఇరువైపుల వాదనలు ముగించిన హైకోర్టు.. మంగళవారం తీర్పు వెలువరించింది. కేటీఆర్‌ను అరెస్ట్ చేయకుండా గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను హైకోర్టు ఉపసంహరించింది. ఏసీబీ అరెస్ట్ చేయకుండా 10 రోజుల పాటు మధ్యంతర ఉత్తర్వులు పొడిగించాలన్న కేటీఆర్ విజ్ఞప్తిని తిరస్కరించింది. ఉన్నత న్యాయస్థానం తీర్పుపై కేటీఆర్ తన న్యాయవాదులతో చర్చిస్తున్నారు. దీనిపై ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించే యోచనలో ఉన్నట్లు సమాచారం. మరోవైపు తెలంగాణ ప్రభుత్వం సర్వోన్నత మిగతా 2లో..




## ఢిల్లీ ఎన్నికలకు మోగిన నగారా

10న నోటిఫికేషన్ విడుదల.. 17 వరకు నామినేషన్ల స్వీకరణ

20 వరకు నామినేషన్ల ఉపసంహకరణ

మొత్తం 70 అసెంబ్లీ స్థానాలకు ఫిబ్రవరి 5న పోలింగ్

**న్యూఢిల్లీ, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలకు నగారా మోగింది. కేంద్ర ఎన్నికల సంఘం ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేసింది. ఈ ఏడాది ఫిబ్రవరి 23తో ప్రస్తుత అసెంబ్లీ గడవు ముగుస్తుండటంతో ఆలోపే నూతన ప్రజాప్రతినిధులను ఎన్నుకోవాల్సి ఉంది. ఈ నేపథ్యంలో మంగళవారం ఢిల్లీలోని మొత్తం 70 అసెంబ్లీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించడం కోసం కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించింది. ఢిల్లీ అంతటా ఒకే విడతలో ఫిబ్రవరి 5న పోలింగ్ నిర్వహించనున్నట్లు ఎన్నికల సంఘం తెలిపింది. ఫిబ్రవరి 8న ఓట్లను లెక్కించి ఫలితాలను వెల్లడించనున్నట్లు పేర్కొంది. జనవరి 10న ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానుంది. జనవరి 17 వరకు నామినేషన్‌లు స్వీకరించనున్నారు. జనవరి 20 వరకు మిగతా 2లో..

## కేబినెట్ అనుమతులు లేకుండా భారీగా నగదు బదిలీ

ఆర్థిక శాఖ అనుమతులు లేకుండా ఎలా చేశారు

విదేశీ సంస్థకు నేరుగా నగదు తరలింపుపై హైకోర్టు విస్మయం

ఈ లావాదేవీలపై లోతుగా విచరణ జరగాల్సిందే

క్వాష్ పిటిషన్ సందర్భంగా హైకోర్టు కీలక వ్యాఖ్యలు

గ్రీన్‌కో సంస్థలపై ఎసిబి దాడులతో కూపీ లాగే యత్నాలు

2లో

## ప్రియాంకగాంధీపై బిజెపి నేత అనుచిత వ్యాఖ్యలు

- పరస్పర దాడులకు తెగబడ్డ కాంగ్రెస్, బిజెపి కార్యకర్తలు
- నాంపల్లి బిజెపి కార్యాలయంపై యూత్ కాంగ్రెస్ దాడి
- ప్రతిగా గాంధీభవన్‌పై దాడికి దిగిన బిజెపి శ్రేణులు
- రంగంలోకి దిగి చెదరగొట్టిన పోలీసులు



2లో

## దేశంలో అత్యంత రిచెస్ట్ పార్టీ బిఆర్ఎస్

- అంతగా డబ్బులుఎక్కడి నుంచి వచ్చాయో తేలాలి
- కెటిఆర్‌లో కొత్త సంవత్సరం స్పిరిట్ పెరిగింది
- సిరిసిల్లలో 2వేల ఎకరాల భూమి హాంఫట్
- భూముల అన్యాక్రాంతంపై ఫోరెన్సిక్ ఆడిట్
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వ్యంగ్య వ్యాఖ్యలు



**హైదరాబాద్, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** దేశంలోని ప్రాంతీయ పార్టీల్లో అత్యంత రిచెస్ట్ పార్టీ బీఆర్ఎస్ పార్టీ అని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గుర్తు చేశారు. ఆ పార్టీకి అంత నగదు ఎలా వచ్చిందంటూ ఈ సందర్భంగా ఆయన సందేహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మారలేదని.. కానీ ఆయన రైటర్ మారినట్లుగా ఉందని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వ్యంగ్యంగా అన్నారు. కారు రేసు కేసులో హైకోర్టు తీర్పు అనంతరం కేటీఆర్ మిగతా 2లో..

## కుప్పంలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం

### జననాయకుడు పోర్టల్ ద్వారా ఫిర్యాదుల స్వీకరణ.. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్న చంద్రబాబు

**కుప్పం, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** మోడల్ నియోజకవర్గంగా కుప్పాన్ని తీర్చిదిద్దుతామని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. అన్ని ప్రాంతాలతో సమానంగా.. అవసరమైతే మిన్నగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని చెప్పారు. కుప్పంలోని తెదేపా కార్యాలయంలో 'జననాయకుడు' పేరిట ఫిర్యాదుల స్వీకరణకు పోర్టల్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రజలు, పార్టీ కార్యకర్తల సమస్యలు, విజ్ఞప్తులను సీఎం పరిశీలించారు. ప్రతి కౌంటర్ వద్దకు స్వయంగా వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి అక్కడికక్కడే అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సమస్యలు, మిగతా 2లో..



విలేకరులు కావలెను

స్నేహిత ఎక్స్‌ప్రెస్ తెలుగు దినపత్రిక

expresstelugudaily.com



Contacts

తెలంగాణ

95500 21491

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో

ఎక్స్‌ప్రెస్ తెలుగు దినపత్రికలో పలు విభాగాల్లో పనిచేయుటకు ఉత్సాహవంతులైన స్టేట్ బ్యూరో, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు మండల రిపోర్టర్లు, యాడ్స్ ఏజెంట్స్ వెంటనే కావలెను. ఆసక్తి.. అనుభవం గల వారు సంప్రదించగలరు..

## యూత్ కాంగ్రెస్ దాడి దుర్మార్గం

**హైదరాబాద్, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** భాజపా రాష్ట్ర ప్రధాన కార్యాలయంపై యూత్ కాంగ్రెస్ కార్యకర్తల దాడిని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తీవ్రంగా ఖండించారు. ఇలాంటి దుర్మార్గ రాజకీయాలకు కేరాఫ్ అడ్రస్ అయిన కాంగ్రెస్ పార్టీ.. తీరు మార్చుకోకపోతే పరిస్థితులు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. పోలీసుల సమక్షంలోనే కాంగ్రెస్ కార్యకర్తలు దాడికి పాల్పడటం దుర్మార్గమన్నారు. పోలీసులను వెంట తీసుకొచ్చి భాజపా కార్యాలయంపై రాళ్లు విసిరారని, పోలీసులు ఇలా వ్యవహరించడం ఎంత వరకు సమంజమని హైదరాబాద్ సీపీని ప్రశ్నించారు. భాజపా తలచుకుంటే కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు రోడ్లమీద తిరగలేరని హెచ్చరించారు. రోజు రోజుకూ కనుమరుగవుతున్న కాంగ్రెస్ పార్టీ.. నిరాశతో భౌతిక దాడులకు దిగడాన్ని ప్రజలు క్షమించరన్నారు. ప్రజాస్వామ్యంలో హింసా రాజకీయాలు, భౌతిక దాడులకు తావు లేదన్నారు. రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ ఎక్కడ ఉందని భాజపా ఎమ్మెల్యే రాజాసింగ్ ప్రశ్నించారు. దాడిపై సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

## నేడు విశాఖకు ప్రధాని మోడీ



**విశాఖపట్టణం, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** విశాఖ స్టీల్ ప్లాంట్ పునరుద్ధరణ కోసం మంచి ప్యాకేజీ కేంద్రం ప్రకటిస్తుందని బీజేపీ ఎంపి, పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి తెలిపారు. ఉక్కు ఉద్యోగుల జీతభత్యాల చెల్లింపులో ఇబ్బందులు ఉన్నాయన్న విషయం కేంద్రమంత్రి దృష్టికి తీసుకుని వెళతామని అన్నారు. డబుల్ ఇంజన్ సర్కార్ వల్ల జరిగే అభివృద్ధి నమూనాకు ఆంధ్రప్రదేశ్ ఉదాహరణ అని పురందేశ్వరి తెలిపారు. విశాఖలో ప్రధాని సభా వేదిక ఏర్పాట్లను బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. కీలక వ్యాఖ్యలు చేశారు. స్టీల్ ఎ÷-లాంట్‌కు త్వరలో కేంద్ర ఉక్కు మంత్రి కుమార స్వామి రివైవల్ ప్యాకేజీ ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్టు తెలుస్తోంది.. రూ.17 వేల కోట్లు రివైవల్ ప్యాకేజీ వచ్చే అవకాశం ఉందని అన్నారు. అమరావతికి రూ.15 వేల కోట్లు, పోలవరంకు రూ.12500, టాక్స్ డివల్యూషన్ కింద 7200, పంచాయతీ రాజ్ శాఖకు 4800 ఓఔఖీఇఉ÷ూ పెద్ద ఎత్తున నిధులు ఇచ్చి కేంద్రం సహకరించిందని పురందేశ్వరి తెలిపారు. రూ.6000 కోట్లతో జల్ జీవన్ మిషన్ పథకాన్ని అమలు చేస్తోందన్నారు. మరోవైపు.. మోడీ సభలకు జన సమీకరణ అవసరం లేదని చెప్పారు. మరోవైపు.. తెలంగాణలో కాంగ్రెస్, బీజేపీ దాడిపై పురందేశ్వరి స్పందించారు. కాంగ్రెస్ అప్రజాస్వామికంగా వ్యవరించిందని దుయ్యబట్టారు. బీజేపీ నేతలపై దాడి చేయడం ఖండిస్తున్నామన్నారు. చట్టపరంగా వ్యవహరించాలని డిమాండ్ చేస్తున్నామని పురందేశ్వరి తెలిపారు.ప్రధాని నరేంద్ర మోడీ బుధవారం విశాఖకు వస్తున్నారు. పర్యటనలో భాగంగా.. ఎన్టీపీసీ ప్రాజెక్ట్, వైజాగ్ రైల్వే జోన్, జోనల్ హెడ్ క్వార్టర్ శంకుస్థాపన వంటి కార్యక్రమాలకు ప్రధాని శంఖుస్థాపన చేస్తారు. అంతేకాకుండా.. కొన్ని పూర్తి అయిన ప్రాజెక్ట్‌లను కూడా ప్రధాని ప్రారంభించనున్నారు. ప్రధాని పర్యటనకు ఏపీ ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తోంది. మంత్రులు ప్రత్యేకంగా ప్రధాని టూర్ పై దృష్టి పెట్టారు. మంత్రి నారా లోకేష్ స్వయంగా వైజాగ్ వెళ్లి మరీ సమీక్ష నిర్వహించారు. మరోవైపు.. ప్రధాని మోడీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ వైజాగ్‌లో రోడ్ షో నిర్వహించనున్నారు.


## ప్రియాంకగాంధీపై బిజెపి నేత అనుచిత వ్యాఖ్యలు

**హైదరాబాద్, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** బిజెపి, కాంగ్రెస్ శ్రేణులు పరస్పర దాడులతో హైదరాబాద్ నాంపల్లి ప్రాంతంలోని ఈ రెండు పార్టీ ఆఫీసుల వద్ద ఉద్రిక్తత నెలకొంది. కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీపై ఢిల్లీ బీజేపీ కాల్కాజీ ఎమ్మెల్యే అభ్యర్థి రమేష్ బిదురి చేసిన వ్యాఖ్యలపై వివాదం కొనసాగుతోంది. రమేష్ బిదురి వ్యాఖ్యలకు నిరసనగా, రాష్ట్రవ్యాప్తంగా బీజేపీ కేంద్ర మంత్రులను అడ్డుకోవాలని యూత్ కాంగ్రెస్ నేతలు పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో, కాంగ్రెస్ కార్యకర్తలు హైదరాబాద్ నాంపల్లి బీజేపీ కార్యాలయాన్ని ముట్టడించేందుకు యత్నించారు. రాళ్ళ, కోడిగుడ్లతో దాడులు చేసి, రమేష్ బిదూరి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ దాడిలో ఓ బీజేపీ కార్యకర్త తలకు తీవ్ర గాయాలపాలయ్యాడు. దీనికి ప్రతిగా, కోపోద్రికులైన బీజేపీ కార్యకర్తలు కాంగ్రెస్ కార్యకర్తలపై కర్రలతో దాడి చేయడానికి ప్రయత్నించడంతో, ఆ ప్రాంతంలో ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. తరవాత బిజెపి కార్యకర్తలు దాడికి దిగడంతో గాంధీ భవన్ వద్ద తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. గాంధీ భవన్ ముట్టడించేందుకు బీజేపీ శ్రేణులు పెద్దఎత్తున రావడంతో ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. పెద్దఎత్తున గాంధీ భవన్ వద్దకు చేరుకున్న కాషాయం కార్యకర్తలు అక్కడ ఉన్న ప్లెక్సీలను చింపివేశారు. దీంతో తీవ్ర ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. ఇరువర్గాల మధ్య పెద్దఎత్తున ఘర్షణ జరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో బీజేపీ శ్రేణులను అడ్డుకున్న పోలీసులు వారిని అరెస్టు చేశారు. తెలంగాణలో బీజేపీ కార్యాలయంపై కాంగ్రెస్ కార్యకర్తల దాడి తీవ్ర రాజకీయ ప్రకంపనలు రేపుతోంది. ఈ ఘటనపై బీజేపీ నేతలు తీవ్రంగా స్పందిస్తూ, రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా అదుపు తప్పాయని కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ దాడిని దురదృష్టకరంగా అభివర్ణిస్తూ, ప్రభుత్వ వైఫల్యాన్ని బహిర్గతం చేస్తున్నారు. దాడి అనంతరం, బీజేపీ కార్యకర్తలు గాంధీభవన్‌ను ముట్టడించేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. కానీ పోలీసులు అప్రమత్తమై బీజేపీ శ్రేణులను అడ్డుకోవడంతో, గాంధీభవన్ వైపుగా పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఈ క్రమంలో, బీజేపీ కార్యకర్తలు రాళ్ల దాడి చేస్తుండగా, పోలీసులు వారిని నియంత్రించేందుకు లాఠీచార్జ్ చేశారు. పలువురిని అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మరోవైపు, ఈ ఘటన తర్వాత బీజేపీ కార్యాలయం వద్ద అధిక సంఖ్యలో పార్టీ శ్రేణులు చేరుకుని నిరసనలు వ్యక్తం చేసారు.

## కేబినేట్ అనుమతులు లేకుండా భారీగా నగదు బదిలీ

**హైదరాబాద్, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** ఫార్ములా ఈ కార్ రేసు కేసులో వేగంగా పరిణామాలు మారుతున్నాయి. హైకోర్టు కేటీఆర్ క్వాష్ పిటిషన్‌పై తీర్పు వెలువడిన వెంటనే, ఏసీబీ తన దర్యాప్తును ముమ్మరం చేసింది. ఈ కేసులో కీలకంగా వ్యవహరిస్తున్న గ్రీన్‌కో సంస్థ , దాని అనుబంధ సంస్థల కార్యాలయాల్లో తనిఖీలు చేపట్టింది. హైదరాబాద్, మచిలీపట్నం కార్యాలయాల్లో సోదాలు సాగాయి. నిందితుల ఇళ్లపై సోదాలు చేపట్టేందుకు కోర్టు నుండి సెర్చ్ వారెంట్‌ను కూడా పొందింది. అయితే.. తాజాగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ క్వాష్ పిటిషన్‌పై హైకోర్టు ఆర్డర్ కాపీ సిద్ధమైంది. ఈ ఆర్డర్ కాపీలో జడ్జి లక్ష్మణ్ సంచలన అంశాలు ప్రస్తావించారు. హెచ్ఎండిఏ పరిధికి మించి డబ్బు బదిలీ జరిగిందని హైకోర్టు వెల్లడించింది.. కేబినెట్ ఆమోదం లేని లావాదేవీలపై విచారణ జరగాలని హైకోర్టు సూచించింది. కేటీఆర్ ఆదేశాలతోనే చెల్లింపులు జరిగాయని అంటున్నారని, చెల్లింపులతో ఎవరు లబ్ది పొందారో తెలియాలని హైకోర్టు అభిప్రాయపడింది. ఫార్ములా ఈ-రేస్ కేసు విచారణకు తగిన సమయం ఇవ్వాలని హైకోర్టు ఆదేశించింది. ఈ కేసుపై ఏసీబీ ఆధారాలు సేకరించాలని, ఫార్ములా ఈ-రేస్ కేసులో మేం ఇప్పడే జోక్యం చేసుకోమని హైకోర్టు ధర్మాసనం వెల్లడించింది. ఈ-రేస్ వ్యవహారంలో ఏం జరిగిందో దర్యాప్తులో తేలుతుందని, ఈ తీర్పు కేటీఆర్ క్వాష్ పిటిషన్‌కు మాత్రమే వర్తిస్తుందని హైకోర్టు వెల్లడించింది.ఫార్ములా ఈ-రేసు వ్యవహారంలో ఏసీబీ నమోదు చేసిన కేసును కొట్టివేయాలంటూ భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్ దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌పై విచారణ సందర్భంగా ఉన్నత న్యాయస్థానం పలు కీలక వ్యాఖ్యలు చేసింది. 'అధికారాన్ని దుర్వినియోగం చేశారని ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. హెచ్ఎండీఏ ఖాతాలోని డబ్బును నిబంధనలకు విరుద్ధంగా బదిలీ చేశారనే ఆరోపణలు ఉన్నాయి. రాష్ట్ర ఖజానాకు నష్టం చేకూర్చి ఒప్పందం కుదుర్చుకున్న సంస్థలకు లబ్ది చేకూర్చారని అభియోగాలున్నాయి. ఆరోపణల మేరకు ఏసీబీ అధికారులు పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. పురపాలక మంత్రిగా ఉన్న కేటీఆర్ హెచ్ఎండీఏ నిధులను దుర్వినియోగం చేశారన్న ఆరోపణలున్నాయి. రాష్ట్ర ప్రభుత్వ ఆస్తులకు మంత్రి స్థానంలో ఉన్న వ్యక్తి బాధ్యుడిగా ఉండాలి. ఉత్తమ పరిపాలన అందించే బాధ్యత మంత్రులపైనే ఉంటుంది' అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఈ మేరకు సుప్రీంకోర్టు ఉత్తర్వులను హైకోర్టు ఉదహరించింది. కాగా.. ఫార్ములా ఈ కేసుకు సంబంధించి కేటీఆర్ వేసిన పిటిషన్‌పై హైకోర్టు ఇచ్చిన తీర్పు అనంతరం వేగంగా పరిణామాలు మారిపోయాయి. హైకోర్టు తీర్పుపై ఓవైపు బీఆర్ఎస్ వర్గాల్లో ఆందోళన నెలకొంది. హైకోర్టు తీర్పుపై సుప్రీం కోర్టుకు వెళ్లే యోచనలో కేటీఆర్ ఉన్నట్లు సమాచారం. మరోవైపు సుప్రీంకోర్టులో తెలంగాణ ప్రభుత్వం కీలక పిటిషన్‌ను దాఖలు చేసింది. తమ వాదనలు వినకుండా కేటీఆర్ పిటిషన్‌పై ఎటువంటి నిర్ణయం తీసుకోవద్దంటూ సర్కార్ కేవియట్ దాఖలు చేసింది. దీంతో కేటీఆర్ సుప్రీం కోర్టును ఆశ్రయించినప్పటికీ వెంటనే మధ్యంతర ఉత్తర్వులు జారీ అయ్యే అవకాశాలు తక్కువగా ఉంటాయి. తెలంగాణ ప్రభుత్వ వాదనలు విన్న తర్వాతే సుప్రీం కోర్టు నిర్ణయం తీసుకునే అవకాశం ఉంటుంది. అలాగే ఫార్ములా ఈ కార్ రేసుకు సంబంధించి కేటీఆర్‌కు ఈడీ మరోసారి నోటీసులు జారీ చేసింది. ఈనెల 16న విచారణకు రావాల్సిందిగా ఈడీ నోటీసుల్లో పేర్కొంది. ఈ క్రమంలో ఈడీ విచారణకు కేటీఆర్ హాజరవుతారా లేదా అనే ఉత్కంఠ నెలకొంది. అటు హైకోర్టు తీర్పు తర్వాత ఏసీబీ అధికారులు సమావేశమయ్యారు. తీర్పు నేపథ్యంలో తదుపరి ఎలాంటి చర్యలు తీసుకోవాలనే దానిపై అధికారులు చర్చించారు. సర్చ్ వారెంట్ కోసం కోర్టు నుంచి ఏసీబీ అనుమతి పొందింది. కేటీఆర్, అరవింద్ కుమార్, బీఎల్ఎన్ రెడ్డిపై సోదాలకు కోర్టు సర్చ్ వారెంట్ జారీ చేశారు. ఈ నేపథ్యంలో ఏ క్షణంలోనైనా కేటీఆర్ ఇంటికి ఏసీబీ అధికారులు చేరుకోనున్నారు.

# బిఆర్ఎస్ ఎమ్మెల్యే కెటిఆర్‌కు హైకోర్టు షాక్



(మొదటి పేజీ తరువాయి)
న్యాయస్థానంలో కేవియట్ పిటిషన్ దాఖలు చేసింది. ఫార్ములా ఈ-రేసు కేసులో కేటీఆర్ సుప్రీంకోర్టును ఆశ్రయిస్తే తమ వాదనను కూడా వినాలని ముందస్తుగానే పిటిషన్ వేసింది. ఏసీబీ తరఫున అడ్వొకేట్ జనరల్ (ఏజీ) ఎ.సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపించారు. ఫార్ములా - ఈ రేసు వ్యవహారంలో ఒప్పందం జరగకముందే చెల్లింపులు చేశారని ఆయన కోర్టుకు తెలిపారు. బ్రిటన్ పౌండ్ల రూపంలో రూ.46 కోట్లు చెల్లించినట్లు చెప్పారు. ఈ - కార్ల రేసింగ్ సీజన్ 10 ఒప్పందానికి ముందే నిబంధనలకు విరుద్ధంగా చెల్లింపులు చేశారన్నారు. దర్యాప్తు ఏ దశలో ఉందని ఈ సందర్భంగా ఏజీని హైకోర్టు ప్రశ్నించింది. కేసు విచారణ ప్రాథమిక దశలోనే ఉందని.. అన్ని ఆధారాలు బయటపడతాయని ఏజీ తెలిపారు. ఇప్పటికే ఫిర్యాదుదారు దానకిశోర్ వాంగ్మూలం సేకరించినట్లు కోర్టుకు తెలిపారు. నిందితులు అర్వింద్ కుమార్, బీఎల్ఎన్ రెడ్డి ఏమైనా పిటిషన్లు దాఖలు చేశారా అని న్యాయస్థానం ప్రశ్నించారు. ఇప్పటివరకు నిందితులు ఎలాంటి పిటిషన్లు దాఖలు చేయలేదని, ఈ కేసులో ఎవరినీ అరెస్టు చేయలేదని ఏజీ తెలిపారు. గవర్నర్ అనుమతి తర్వాతే ఎఫ్ఐఆర్ నమోదు చేశామని ధర్మాసనానికి ఏజీ తెలిపారు. దానకిశోర్ తరఫున సీనియర్ న్యాయవాది సీపీ మోహన్‌రెడ్డి వాదనలు వినిపించారు. పురపాలక శాఖ మంత్రి పర్యవేక్షణలోనే ఆ శాఖ అధికారులు విధులు నిర్వహిస్తారన్నారు. రేసింగ్‌కు సంబంధించిన చెల్లింపుల దస్త్రాన్ని అప్పటి పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ ఆమోదించారని కోర్టుకు తెలిపారు. రేసింగ్ వ్యవహారంలో అన్ని రకాల నిబంధనలను ఉల్లంఘించారని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. కేటీఆర్ తరఫున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది సిద్దార్థ్ దవే వాదనలు వినిపించారు. ఏసీబీ అధికారులు నమోదు చేసిన సెక్షన్లు కేటీఆర్‌కు వర్తించవని కోర్టుకు తెలిపారు. నగదు బదిలీలో కేటీఆర్ ఎక్కడా లబ్దిపొందలేదని, అవినీతి జరిగినట్లు కూడా ఎఫ్ఐఆర్‌లో ఎక్కడా పేర్కొనలేదని తెలిపారు. ఫార్ములా-ఈ కార్ల రేసు నిర్వహణపై జరిగిన ఒప్పందంలో పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి, ఫార్ములా -ఈ ఆపరేషన్స్ సంస్థ సంతకాలు చేశాయని ఆయన వాదించారు. పురపాలక శాఖకు మంత్రిగా బాధ్యతలు నిర్వహించిన కేటీఆర్‌ను ఎఫ్ఐఆర్‌లో నిందితుడిగా చేర్చడం తగదన్నారు. ఈ మేరకు పలు హైకోర్టు తీర్పులను సిద్దార్థ్ దవే ప్రస్తావిస్తూ ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలని కోరారు. ఈ కేసులో ఏసిబి వాదనలు పరిగణలోకి తీసుకున్న హైకోర్టు కొద్దిసేపటిక్రితమే కెటిఆర్ క్వాష్ పిటిషన్ ను కొట్టివేస్తూ తీర్పు వెల్లడించింది. కాగా, సోమవారం ఏసిబి విచారణకు హాజరుకావాల్సి ఉండగా.. కెటిఆర్ దుమ్మా కొట్టిన సంగతి తెలిసిందే. తన లాయర్ ను ఏసిబి కార్యాలయంలోకి అనుమతించక పోవడంతో ఆయన విచారణకు హాజరవ్వకుండానే తిరిగి వెళ్లిపోయారు. దీంతో విచారణకు హాజరవ్వాలని మరోసారి ఎసిబి అధికారులు కెటిఆర్ కు నోటీసులు ఇచ్చింది.మరోవైపు, ఇదే కేసులో ఇవాళ ఈడీ విచారణ పిలవగా.. తనకు సమయం కావాలని కెటిఆర్ కోరారు. దీంతో ఆయనకు కొంత సమయం ఇస్తున్నట్లు తెలిపింది.

## ఢిల్లీ ఎన్నికలకు మోగిన నగారా

(మొదటి పేజీ తరువాయి)
నామినేషన్‌ల ఉపసంహరణకు గడువు ఇచ్చారు. షెడ్యూల్ విడుదల సందర్భంగా చీఫ్ ఎలక్షన్ కమిషనర్ రాజీవ్ కుమార్ మాట్లాడుతూ.. ఈవీఎంలపై పలువురు అభ్యంతరాలు వ్యక్తం చేస్తుండటంపై క్లారిటీ ఇచ్చారు. ఓటర్ లిస్ట్ ట్యాంపరింగ్ జరిగిందన్న ఆరోపణలను ఈసీ తోసిపుచ్చింది. ఎన్నికలను పారదర్శకంగా నిర్వహిస్తున్నామని తెలిపింది. ఈవీఎంలను ఎవరూ ట్యాంపరింగ్ చేయలేరని స్పష్టం చేసింది. గత ఏడాది ఎన్నికలను విజయవంతంగా నిర్వహించామని గుర్తుచేసింది. దేశంలో ఓటర్ల సంఖ్య 99 కోట్లు దాటిందని, మహిళా ఓటర్ల సంఖ్య 48 కోట్లు దాటిందని సీఈసీ రాజీవ్ కుమార్ చెప్పారు. ఈ ఏడాది తొలి ఎన్నికలు ఢిల్లీలో జరగబోతున్నాయని అన్నారు. ఢిల్లీలో అన్ని ప్రాంతాల ఓటర్లు ఉంటారని పేర్కొన్నారు. ఈవీఎంల ట్యాంపరింగ్ ఆరోపణలు సీఈసీ రాజీవ్‌కుమార్ ఖండించారు. ఈవీఎంలతోనే ఫలితాలు పారదర్శకంగా ఉంటాయని, ఈవీఎంల రిగ్గింగ్ జరిగినట్లు ఇంతవరకు ఎక్కడా నిరూపణ కాలేదని ఆయన తెలిపారు. ఈవీఎంల రిగ్గింగ్ సాధ్యం కాదని చెప్పారు. చీఫ్ ఎలక్షన్ కమిషనర్‌గా ఇదే తనకు చివరి ప్రెస్ మీట్ అని సీఈసీ చెప్పారు. ఓటింగ్ శాతంపై కొందరు అనుమానాలు వ్యక్తం చేస్తుండటంపై కూడా సీఈసీ స్పందించారు. పోలింగ్ రోజు సాయంత్రం 6 గంటలకు కచ్చితమైన పోలింగ్ శాతం వెల్లడించడం సాధ్యం కాదని అన్నారు.




## కుప్పంలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం

(మొదటి పేజీ తరువాయి)
ఫిర్యాదులు రిజిస్టర్ చేసేలా ఈ పోర్టల్‌లో ఏర్పాట్లు చేశారు. అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో చంద్రబాబు మాట్లాడారు. 'ఫిర్యాదుల స్వీకరణకు 'జననాయకుడు' పేరుతో ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం. ప్రజలతో పాటు తెదేపా నేతలు, కార్యకర్తలు తమ ఫిర్యాదులు, సమస్యలను నమోదు చేయవచ్చు. వాట్సప్ ద్వారా కూడా సమాచారం ఇవ్వొచ్చు. వాటిని పోర్టల్‌లో నమోదు చేసి విశ్లేషించి పరిష్కారం చూపుతాం. స్థానిక ఎమ్మెల్యేగా ఈ నియోజకవర్గం విషయంలో నాపై ప్రత్యేక బాధ్యత ఉంది. ఇక్కడి ప్రజలు వరుసగా 8 సార్లు గెలిపించారు. సీఎంగా ఉన్నందున అంచనాలు ఎక్కువగా ఉంటాయి. ఏ అర్జీ వచ్చినా నిర్దిష్ట సమయంలో పరిష్కార మార్గం చూపిస్తాం. ఇది వినూత్న ప్రయోగం' అని చంద్రబాబు అన్నారు. స్వర్ణ కుప్పంలో భాగంగా ఎన్టీఆర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలు అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపనలు చేశారు. వివిధ కంపెనీల ప్రతినిధులతో సీఎం సమావేశమయ్యారు. చిత్తూరు జిల్లా శాంతిపురం మండలం ఐపీ తంబిగాని పల్లి, తంబి గానిపల్లి గ్రామంలో 41.22 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేయనున్న ప్రాసెసింగ్ ప్లాంట్‌కు సీఎం శంకుస్థాపన చేశారు. మదర్ డెయిరీ ఫ్రూట్ విజిటబుల్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో రూ.105.10 కోట్ల వ్యవయంతో ఈ ప్రాసెసింగ్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయనున్నారు. 4800 మందికి ఉపాధి దిశగా ఈ ప్లాంట్‌ను ఏర్పాటు చేయనున్నారు. అలాగే ఫ్రూట్ పల్ప్ (మామిడి, టమోటా) తయారీ ద్వారా 50 వేల మంది రైతులకు ప్రయోజనం పొందేలా చర్యలు చేపడుతున్నట్లు మదర్ డైరీ డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ జయ తీర్థ చారి.. సీఎంకు వివరించారు.అలాగే శాంతిపురం మండలం ఐపీ తంబి గానిపల్లి, తంబి గానిపల్లి గ్రామం వద్ద 40 ఎకరాలలో ఏపీఐఐసీ ద్వారా శ్రీజ ప్రొడ్యూసర్ కంపెనీ (పాల పొడి తయారీ)కి భూమిని కేటాయించారు. దాదాపు రూ.233 కోట్లతో 4000 మందికి ఉపాధి కల్పించే విధంగా ఈ ప్రాజెక్టను ఏర్పాటు చేయనున్నారు. ఈ ప్రాజెక్టులో ఇప్పటికే లక్ష మంది మహిళా రైతుల భాగస్వామ్యంగా ఉన్నారని ముఖ్యమంత్రికి సీఈఓ తిమ్మప్ప, చైర్మన్ శ్రీదేవి వివరించారు. ఒకే రోజు 200 మెట్రిక్ టన్నుల ఉత్పత్తి చేసే సామర్థ్యం గల క్యాటిల్ ఫీడ్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. కుప్పం మున్సిపాలిటీలో అర్బన్ ప్రాజెక్టుల నిర్వహణ, అధికారుల అతిథి గృహాల నిర్మాణం కోసం సమీకృత కాంప్లెక్స్‌లో రూ.10 కోట్ల అంచనా వ్యవయంతో కమాండ్ కంట్రోల్ రూమ్ (2 అంతస్తులు) నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. డీకే పల్లి పార్కుల అభివృద్ధి, సుందరీకరణ, కుప్పం ఏరియా అభివృద్ధిలో రోడ్డు జంక్షన్లు, వీధి దీపాలను ప్రత్యేక గ్రాంట్లతో రూ.60.20 కోట్ల అంచనా వ్యయంతో కుప్పంలో ఏర్పాటు చేశారు. అలాగే రూ. 110.21 కోట్లతో కుప్పం నియోజకవర్గంలోని 451 డ్రైనేజీ వర్కులను, జీఎస్ హెచ్11-ఎస్‌డీపీ నిధుల ద్వారా చేపట్టిన పనులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రారంభోత్సవం చేశారు.

## కాంగ్రెస్ దాడిని ఖండించిన బిజెపి నేతలు

**హైదరాబాద్, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** బిజెపి కార్యాలయంపై కాంగ్రెస్ దాడిని బిజెపి తీవ్రంగా ఖండించింది. పార్టీ నేతలు ఈ దాడిని తీవ్రంగా తీసుకున్నారు. తాము తలచుకుంటే గాంధీభవన్ ఉంటుందా అని ప్రశ్నించారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై కాంగ్రెస్ మూకలు దాడి చేయడంపట్ల కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..10 మంది కార్యకర్తలొచ్చి దాడులు చేస్తుంటే బీజేపీ చూస్తూ ఊరుకోదన్నారు. బీజేపీ కార్యకర్తలు తలుచుకుంటే గాంధీభవన్ సహా కాంగ్రెస్ కార్యాలయాల పునాదులు కూడా మిగలవని హెచ్చరించారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని అధికార పార్టీ కార్యకర్తలు రాళ్లతో దాడులు చేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం ఏం చేస్తోందని ప్రశ్నించారు. రాళ్ల దాడులను కాంగ్రెస్ పార్టీ ప్రోత్సహించాలనుకుంటోందా? పిల్లలు, వృద్ధులకు రాళ్ల తగిలితే పరిస్థితి ఏ విధంగా ఉండేదా తెలియదా? అని నిలదీశారు. బీజేపీ కార్యకర్తల సహనాన్ని చేతగానితనంగా భావించొద్దన్నారు. తప్పుడు వ్యాఖ్యలు ఎవరు చేసినా ఖండించాల్సిందే. చట్టపరంగా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అంతేగాని చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని భయపెట్టాలని చూస్తే ఊరుకునేది లేదన్నారు. తక్షణమే దాడికి పాల్పడ్డ కార్యకర్తలను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. బీజేపీ శాసన సభ పక్షనేత మహేశ్వర్ రెడ్డి స్పందిస్తూ.. బీజేపీ కార్యాలయంపై దాడిని ఖండిస్తున్నా నన్నారు. బీజేపీ కార్యాలయం పై కాంగ్రెస్ దుండగులను పంపించి దాడులు చేశారని, కార్యకర్తల తలలు పగల గొట్టారని ఆయన మండిపడ్డారు. రాష్ట్రంలో అసలు ప్రభుత్వ ఉందా..? అని ఆయన ప్రశ్నించారు. ఏం చెప్పాలని అనుకుంటున్నారు.. ఏమిటి ఈ సంస్కృతి.. రాష్ట్రానికి హోంమంత్రి లేరు.. సీఎం ఏం చెప్పాలని అనుకుంటు న్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. పీసీసీ చీఫ్ దీనికి బాధ్యత వహించాలని, మహేష్ కుమార్ గౌడ్ వి చిల్లర చేష్టలు అని ఆయన ధ్వజమెత్తారు. దాడికి బాధ్యత వహించి మహేష్ కుమార్ గౌడ్ రాజీనామా చేయాలని, హోం మంత్రి సీఎం చేతుల్లో ఉంది ఆయన రాజీనామా చేస్తారా ? అని ఆయన దుయ్యబట్టారు. దీంతోపాటు.. ఫార్ములా ఈ రేసు కేసు గురించి మాట్లాడుతూ.. కేటీఆర్ అధికారుల ప్రమేయం ఉందని అంటున్నారని, అధికారులను కేటీఆర్ బెదిరించారన్నారు. కేటీఆర్ నిర్దోషి ఐతే నిలబడి ఎదుర్కోవాలని, వాస్తవాలను బయటపెట్టాలన్నారు. గత ప్రభుత్వంలో అనేక అక్రమాలు జరిగాయన్నారు మహేశ్వర్ రెడ్డి. ఈ పరిస్థితులపై బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ తీవ్ర విమర్శలు గుప్పించారు. ఆయన మాట్లాడుతూ, 'బీజేపీ కార్యాలయంపై కాంగ్రెస్ కార్యకర్తల దాడి దురదృష్టకరమైన ఘటన. ఇది కాంగ్రెస్ పార్టీ అసహనాన్ని, బీఆర్ఎస్ తరహా విధానాలను ప్రతిబింబిస్తోంది. మేము కూడా ప్రతిగా ఇలానే ప్రవర్తిస్తే, మీ జాతీయ నాయకులు ఎక్కడికి దాక్కుంటారో' అని ప్రశ్నించారు. అదే సమయంలో, తెలంగాణలో అవినీతి విషయాలపై ఆయన తన ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. 'కేటీఆర్ ఎంతకాలం తప్పించుకుని తిరుగుతారు? చంచల్‌గూడ జైలుకు వెళ్లాలా లేక తీహార్ జైలుకు వెళ్లాలా అనేది కేటీఆర్ నిర్ణయించుకోవాలి. కేసీఆర్ కుటుంబం లక్షల కోట్ల రూపాయల అవినీతికి పాల్పడింది. ప్రజల డబ్బును దోచుకుని కోర్టుల్లో పిటిషన్లు వేస్తూ కాలయాపన చేస్తున్నారు. బీజేపీ మాత్రం తెలంగాణలో త్వరలో అధికారంలోకి వస్తుంది,' అని ధర్మపురి భరోసా వ్యక్తం చేశారు. తెలంగాణలో పాలనపై కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రభుత్వాల విధానాలను విమర్శిస్తూ, బీజేపీ తన రాజకీయ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తుందని స్పష్టంగా పేర్కొన్నారు.

## దేశంలో అత్యంత రిచెస్ట్ పార్టీ బిఆర్ఎస్

(మొదటి పేజీ తరువాయి)
ట్వీట్ చేసిన నేపథ్యంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పందించారు. ఆ క్రమంలో కేటీఆర్‌పై ఆయన వ్యంగ్య బాణాలు సంధించారు. మంగళవారం హైదరాబాద్‌లో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఇష్టాగోష్టిగా మాట్లాడుతూ.. సియోల్ బాంబులు పేలడం మొదలవుతున్నాయన్నారు. చేసిన తప్పు ఎప్పటికైనా బయటపడుతుందని ఆయన పేర్కొన్నారు. తప్పు చేసిన వారు.. ఎప్పటికీ తప్పించుకో లేరని స్పష్టం చేశారు. అయితే న్యాయస్థానాలు, వ్యవస్థల ముందు బల ప్రదర్శన చేయడం కరెక్ట్ కాదని ఆయన అభిప్రాయపడ్డారు. తప్పులు.. ఒప్పులు తేల్చేది కోర్టులని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. తమకు బీఆర్ఎస్ పార్టీ నాయకులు టార్గెట్ కాదని స్పష్టం చేశారు. తాము ఎవరినీ టార్గెట్ చేయలేదన్నారు. కేటీఆర్ తప్పు చేయక పోతే కోర్టుకు ఎందుకు వెళ్లారని ఆయన ప్రశ్నించారు. కొత్త సంవత్సరంలో కేటీఆర్‌లో స్పిరిట్ పెరిగిందని చమత్కరించారు. కాంగ్రెస్ పార్టీకి బాండ్స్ ఎందుకు ఇచ్చారో.. అప్పుడు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ చెప్పాలని డిమాండ్ చేశారు. బాండ్స్ మాత్రమే కాదు ఇంకా బయటకు రావాల్సినవి చాలా ఉన్నాయన్నారు. ఇక విదేశీ కంపెనీకి వెళ్లిన నగదు ఎవరి ఖాతాలోకి వెళ్ళాయో తేలాల్సి ఉందన్నారు. కేసీఆర్ ఏ కేసులో ఉన్నా.. మాజీ మంత్రి హరీష్ రావు అక్కడ ఉంటారంటూ వ్యంగ్యంగా పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, కాంగ్రెస్ ప్రభుత్వానికి కేసీఆర్ కుటుంబాన్ని కావాలని టార్గెట్ చేసే ఆలోచన లేదన్నారు. అయితే ఏది బయట పడినా.. అందులో ఆ కుటుంబం పాత్ర మాత్రం ఉంటుందన్నారు. ఇక ఇప్పటి వరకు వేసిన కేసులు, విచారణ కమిషన్లు అన్ని బిఆర్ఎస్ పార్టీ వాళ్లు అడిగితేనే వేశామని ఆయన గుర్తు చేశారు. కాళేశ్వరం, విద్యుత్, ఈ ఫార్ములా అంశాలపై సైతం విచారణ జరపాలని వారు కోరారని ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి గుర్తు చేశారు. కక్షపూరితంగా, ఉద్దేశపూర్వకంగా చేసిందేమీ లేదన్నారు. వ్యవస్థలో వాళ్లు తప్పులు చేశారని.. కాబట్టే అన్ని బయటపడుతోన్నాయని చెప్పారు. జైలుకు వెళ్తేనే సీఎం అవుతానని కేటీఆర్ అనుకుంటే.. కల్వకుంట్ల కవిత ముందు ఉన్నారని గుర్తు చేశారు. ఇవేది లాభ నష్టాల కోసం జరుగుతున్నవి కావన్నారు. ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్ నిజాలు చేప్తే.. అన్ని విషయాలు బయటకు వస్తాయన్నారు. జాతీయ పార్టీలకు లేని నిధులు ప్రాంతీయ పార్టీలకు ఎలా వచ్చాయంటూ ఆయన అనుమానం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉండగా.. దేశం గురించి తప్ప తెలంగాణ గురించి మాట్లాడలేదన్నారు. సంక్రాంతి పండుగ అనంతరం రికార్డులను ఫోరెన్సిక్ ఆడిట్ కోసం ప్రైవేట్ సంస్థలకు ఇవ్వబోతున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. భూదాన్, దేవాదాయ, అసైన్డ్ భూముల్లో జరిగిన కుంభకోణాలన్నీ ఫోరెన్సిక్ ఆడిట్ ద్వారా బహిర్గమవుతాయని పేర్కొన్నారు. సిరిసిల్లలో 2 వేల ఎకరాల ప్రభుత్వ భూమి అన్యాక్రాంతమైందని తెలిపారు. రంగారెడ్డి, మెదక్, మేడ్చల్ జిల్లాల్లో జరిగిన భూ బాగోతం ఫోరెన్సిక్ ఆడిట్ తర్వాత వెలుగులోకి వస్తుందన్నారు. ఇక భుభారతి బిల్లు గవర్నర్ వద్ద ఉందని వివరించారు. గవర్నర్ నుంచి అనుమతి రాగానే గెజిట్ విడుదల అవుతుందని తెలిపారు. అయితే రూల్స్ ప్రేమ్ చేయడానికి రెండు నెలల సమయం పడుతుందన్నారు. విద్యుత్ కమిషన్ రిపోర్ట్ వచ్చింది.. ప్రభుత్వం లీగల్ ఒపినియన్ తీసుకుంటున్నదన్నారు. అలాగే కాళేశ్వరం ప్రాజెక్ట్ కమిషన్ బహిరంగ విచారణ సైతం కొనసాగుతోందన్నారు. అయితే ఫోన్ ట్యాపింగ్ కేసు ఇంకా అవ్వ లేదని స్పష్టం చేశారు. ఈ కేసు ఇంకా కొనసాగుతుందన్నారు. తాను మంత్రి అయిన తర్వాత.. మా జిల్లా మాజీ మంత్రి తాను ఎదురు పడలేదన్నారు. అసలు ఉన్నాడా? లేడా అన్నట్లుగా ఉందన్నారు.



## కంటి ఆపరేషన్ చేసుకున్న రోగులను పరామర్శించిన ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి

**పెద్దేముల్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** ఎల్ఎన్ఆర్ యువసేన ఆధ్వర్యంలో నిర్వహించిన కంటి వైద్య శిబిరంలో భాగంగా హైదరాబాద్ లోని శంకర కంటి ఆస్పత్రిలో కంటి చికిత్స చేయించుకుంటున్న వారిని ఆస్పత్రిలో తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి మంగళవారం కలిసి పరామర్శించారు. పెద్దేముల్ మండల కేంద్రంలో సోమవారం ఎల్ఎన్ఆర్ యువసేన ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి సుమారు 1200 మందికి కంటి పరీక్షలను వైద్యులు నిర్వహించారు.అందులో భాగంగా కంటి ఆపరేషన్ అవసరమైన వారికి హైదరాబాద్ లోని శంకర కంటి ఆస్పత్రిలో కంటి చికిత్సను ఉచితంగా చేయించారు. కంటి చికిత్స చేసుకున్న రోగులను శంకర కంటి ఆసుపత్రిలో తాండూర్ ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితులను,అక్కడ వారి కల్పించిన సౌకర్యాలను,వారికి అందుతున్న వైద్యం గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ సీనియర్ నాయకులు ధారాసింగ్,తాండూరు నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఏ బ్లాక్ అధ్యక్షుడు లొంక నర్సింలు, కాంగ్రెస్ యువజన అధ్యక్షుడు మహేష్,యువనాయకులు లొంక రాములు ఉన్నారు.


## విద్యార్థులు ఏకాగ్రతతో మానసిక ఒత్తిడిని జయించి లక్ష్యసాధన కొరకు కృషి చేయాలి



**పెద్దేముల్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** విద్యార్థులు ఏకాగ్రతతో మానసిక ఒత్తిడిని జయించి లక్ష్యసాధన కొరకు అహర్నిశలు కృషి చేయాలని శ్రీమతి పరమేశ్వరి శ్రీనివాస్ దంపతులు అన్నారు.మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తెలంగాణ రాష్ట్ర ఇంటర్మీడియట్ కమిషనర్ చొరవతో హార్ట్ ఫుల్ నెస్ ఎక్స్పీరియన్స్ లైఫ్ పొటెన్షియ (హెల్ప్) ప్రోగ్రాం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఏకాగ్రత, ఒత్తిడి నివారణ,లక్ష్య సాధన మొదలైన అంశాల గురించి వివరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..విద్యార్థులు కష్టపడి చదువుకొని ఏకాగ్రత తో మానసిక ఒత్తిడిని జయించి ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పెద్దేముల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నర్సింహులు, కళాశాల సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల కోసం పనిచేసేది ప్రజాపక్షం

■ క్యాలెండర్ ఆవిష్కరణ అల్లాదుర్గం తాసిల్దార్ మల్లయ్య




**అల్లాదుర్గం,స్నేహిత ఎక్స్ ప్రెస్:** ప్రజా సమస్యలను ప్రభుత్వ అధికారులకు తెలియజేస్తూ పరిష్కరించడానికి ప్రజాపక్షం వార్తాపత్రిక పని చేస్తుందని తాసిల్దార్ మల్లయ్య అన్నారు. మంగళవారం ప్రజాపక్షం నూతన సంవత్సర 2025 క్యాలెండర్ను ఆవిష్కరించారు.ఆయన మాట్లాడుతూ..గ్రామాలలో ప్రజా సమస్యలను నిర్భయంగా ఎప్పటికప్పుడు ప్రచారం చేస్తూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని అట్టి సమస్యలు పరిష్కరించే దిశగా అధికారులకు తెలియజేస్తూ ప్రజాపక్షం పత్రిక పనిచేస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్ఐ సందీప్,ప్రజాపక్షం విలేఖరి పాపయ్య చారి,మన తెలంగాణ విలేకరి కృష్ణ కంప్యూటర్ ఆపరేటర్ రాజు,గోపాల్ నాయక్,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వెంకటేశ్వర ఆలయంలో నేటి నుండి ఏకాదశి ఉత్సవాలు



**అల్లాదుర్గం,స్నేహిత ఎక్స్ ప్రెస్:** పురాతన ప్రసిద్ధి చెందిన శ్రీ వెంకటేశ్వర దేవాలయంలో వైకుంఠ ఏకాదశి ఉత్సవాలు పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు వేద పండితులు ప్రవీణ్ శర్మ తెలిపారు.స్వామి వారి ఉత్సవాలులో భాగంగా 8)న సుదర్శన హెూమం అభిషేకం గణపతి పూజ,రంగంపేట పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ మాధవానంద స్వామి రాక,9) సుదర్శన హెూమం, శ్రీనివాస కళ్యాణం,10) గరుడసేవ, ఉత్తర ద్వారా స్వామి దర్శనం, అన్న ప్రసాదం తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించి స్వామి వారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

## నూతన డాక్టర్ ను సన్మానించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు



**బంట్వారం,స్నేహిత ఎక్స్ ప్రెస్:** బంట్వారం మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నూతనంగా వీధులు చేపట్టిన డాక్టర్.మజీద్ ఖాన్ ను మంగళవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు సన్మానించారు, ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పోచారం వెంకటేశం,మర్పల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్ పోచారం యాదగిరి, కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు ఆలంపల్లి శ్రీనివాస్,దోరేటి సుధాకర్,ముజీబ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు సేవ చేస్తే ఎంతో సంతృప్తి

- ప్రజలకు సేవ చేసేందుకు మేమున్నాం
- వైద్యులు ప్రాణం పోసే వ్యక్తులు
- ప్రజలకు మెరుగైన వైద్యం అందించడం కోసం కృషి
- సంబంధిత నిపుణులచే మెరుగైన వైద్యం అందిస్తాం
- ప్రభుత్వ ఆస్పత్రి సేవల్లో ఎలాంటి ఇబ్బందులు ఉన్న తెలియజేయండి
- ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సి.రామచంద్రయ్య



**వికారాబాద్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** ప్రజలకు సేవ చేయడం ఎంతో సంతృప్తినిస్తుందని ప్రభుత్వ ఆస్పత్రి సూపరి ంటెండెంట్ డాక్టర్ సి.రామచంద్రయ్య అన్నారు. వికారాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో బాబు చనిపోవడం దురదృష్టకరమైన సంఘటనని భవిష్యత్తులో ఇలాంటి ఘటన జరగకుండా జాగ్రత్త పడతామని ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సి.రామచంద్రయ్య తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిలో 24 గంటల సర్వీసు అందిస్తూ సంబంధిత నిపుణులచే మెరుగైన వైద్యం అందిస్తున్నామని చిన్న పిల్లలకు, సాధారణ జబ్బులకు,ప్రసూతి సేవలు అందిస్తూ ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండి సేవలందిస్తున్నామని ఆయన తెలిపారు.కొన్ని సంఘటనలు జరగడం వలన ఇబ్బందికరమైన పరిస్థితులు ఏర్పడుతున్నాయని వాటిని దృష్టిలో పెట్టుకొని నిరంతరం పర్యవేక్షిస్తూ సిబ్బందికి డాక్టర్లకు నిరంతరం సలహాలు సూచనలు ఇస్తూ ప్రభుత్వ ఆసుపత్రి సేవలు ముందుకు తీసుకెళ్తామని వైద్య పరీక్షలు ఎమర్జెన్సీ సంబంధించిన పరీక్షలు చేస్తున్నామని బ్లడ్ బ్యాంక్ అందుబాటులో ఉన్నదని అత్యవసర సమయంలో రక్తం అందుబాటులో ఉంటుందని ఆయన తెలిపారు.డాక్టర్ అంటే ప్రాణాలు పోసే వ్యక్తిగా పనిచేస్తున్నామని ప్రజలు ప్రభుత్వ ఆసుపత్రి సేవలు మరింత ఉపయోగించుకోవాలని ఎలాంటి ఇబ్బంది ఉన్న తనకు తెలియజేయాలని ఆయన తెలిపారు. వికారాబాద్ ప్రాంత వాసుడైన నాకు వికారాబాద్ కు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్ష ప్రజలకు సేవ చేస్తే ఎంతో సంతృప్తి ఉంటుందని డబ్బు లేని వారే ప్రభుత్వ ఆసుపత్రికి వస్తారు అనే కోణంతో వచ్చే ప్రతి పేషెంట్ ను జాగ్రత్తగా చూసి తగిన చికిత్స అందించే విధంగా కృషి చేస్తున్నామని ఆయన తెలిపారు.56 మంది డాక్టర్లు,164 మంది నర్సింగ్ కేడర్ తో హాస్పిటల్ నిర్వహిస్తున్నామని 24 గంటలు డ్యూటీ డాక్టర్లు పర్యవేక్షించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిలో నిన్న జరిగిన సంఘటనపై విచారణ కమిటీ రిపోర్టు ఆధారంగా చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

## ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల బోధనకు ప్రాధాన్యత కల్పించాలి

■ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్



**వికారాబాద్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** మంగళవారం నాడు కలెక్టరేట్ సమావేశ మందిరంలో పాఠశాలల్లో ఆంగ్లాన్ని సులభతరంగా విద్యా బోధన చేయడంపై మండల విద్యాధికారులు ,ప్రిన్సిపల్స్, ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు, సలహాలు చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..ప్రభుత్వ పాఠశాలల్లో విద్య ప్రమాణాలు మెరుగుపరచడంతో పాటు సులభతరంగా అర్థమయ్యేలా విద్యా బోధన చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పేద విద్యార్థులు ఉంటారు.కాబట్టి ఆంగ్ల భాషకు ప్రాధాన్యత కల్పిస్తూ విద్యాబోధన చేయాలని కలెక్టర్ సూచించారు.పాఠశాలల్లో ప్రొజెక్టర్ల ద్వారా ఇంగ్లీష్ సినిమాలు చూయించడం వల్ల కూడా ఆంగ్లంలో ప్రావీణ్యత సాధించవచ్చునని కలెక్టర్ తెలిపారు. ఇంగ్లీష్ బోధన చేసేందుకు వీలుగా ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటానని కలెక్టర్ తెలిపారు. మార్చి మాసంలోపు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థిని, విద్యార్థులకు ఇంగ్లీషులో నైపుణ్యాన్ని పెంపొందించాలని కలెక్టర్ తెలిపారు. పాఠశాలలకు మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు కంప్యూటర్లు, ఇంటర్నెట్ సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకుంటానని కలెక్టర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ ఉమా హారతి,డిఇఓ రేణుకా దేవి, వయోజన విద్య అధికారి శ్రీనివాస్ గౌడ్,మైనార్టీ బాలికల గురుకుల కళాశాల ప్రిన్సిపల్ మహబూబా ఫాతిమా తదితరులు పాల్గొన్నారు.



## పంటకు వాడే దశలవారీగా యూరియాను తీసుకోవాలి

■ జిల్లా వ్యవసాయ అధికారి ఎండి.వాజిద్ హుస్సేన్



**సిరికొండ,స్నేహిత ఎక్స్ ప్రెస్:** పంటకు వాడే దశలవారీగా యూరియాను తీసుకోవాలి ఎండి.వాజిద్ హుస్సేన్,సిరికొండ మండలం రైతు వేదిక కార్యాలయంలో మంగళ వారం జిల్లా వ్యవసాయ అధికారి ఎండి.వాజిద్ హుస్సేన్ మొక్కజొన్న సాగు పైన అనే కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేశారు. తనిఖీ చేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ. .నిజామాబాద్ జిల్లాకు 75 వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగా ఇప్పటివరకు 54 వేల మెట్రిక్ టన్నుల యూరియా వచ్చింది అని అన్నారు.సిరికొండ మండలానికి 3వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగా ఇప్పటివరకు 18 వేల మెట్రిక్ టన్నుల యూరియా వచ్చింది అని అన్నారు. యూరియా కొదవలేదు పిఏసిఎస్ మరియు ప్రైవేట్ డీలర్ పరిధిలో యూరియా అందుబాటులో ఉన్నది రైతులు పంటకు సరిపడా ఒకేసారి తీసుకోకుండా పంటకు వాడే దశలవారీగా యూరియాను తీసుకోవాలని సూచించారు. జిల్లాలో 202 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా యూరియాను అందిస్తున్నామని అన్నారు. నిజామా బాద్ జిల్లాలో 4 లక్షల 37 వేల ఎకరాలలో వివిధ పంటలు వరి,మొక్కజొన్న,జొన్న, కందులు,పండిస్తున్నారని అన్నారు. రైతులకు ఫాక్స్ మరియు ప్రైవేట్ డీలల ద్వారా ఎరువులు అందుబాటులో ఉంచుతామని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి ఎండి బాజీ హుస్సేన్ సిరికొండ ఎంఏఓ టి.నర్సయ్య, ఏఈఓలు,రైతులు తదితరులు పాల్గొన్నారు.



## జన్మదిన వేడుకలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

**చౌడాపూర్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** వికారాబాద్ జిల్లా చౌడాపూర్ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు మంగళి సాయి కుమార్ కూతురి జన్మదిన వేడుకలో చౌడాపూర్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొని చిన్నారిని ఆశీర్వదించడం జరిగింది.


## ఆదర్శ పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరణ

■ ప్రిన్సిపల్ బ్యూలా




**బంట్వారం,స్నేహిత ఎక్స్ ప్రెస్:** మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో(మోడల్ స్కూల్లో) 2025- 2026 విద్యా సంవత్సరం అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంబమైందని ప్రిన్సిపల్ బ్యూలా తెలిపారు. 6 తరగతి నుంచి 10వ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్లకు ప్రవేశాలు కోరుతున్నట్లు ఆమె తెలిపారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ. .ఈనెల 6 నుంచి 28 లోపు దరఖాస్తు చేసుకోవాలని,ఏప్రిల్ 3 నుంచి హాల్ హాల్ టికెట్లు డౌన్లోడ్ చేసుకోవాలని,ఏప్రిల్ 13న ప్రవేశ పరీక్ష ఉంటుందని అన్నారు.

## విశాలాంధ్ర దినపత్రిక క్యాలెండర్ ఆవిష్కరణ



**కుత్బుల్లాపూర్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** విశాలాంధ్ర దినపత్రిక నూతన సంవత్సర క్యాలెండర్ ను కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి,బాచుపల్లిలోని కార్యాలయంలో కుత్బుల్లాపూర్ జోన్ ఇంచార్జి శంకర్,రిపోర్టర్ మధు,స్థానిక నాయకులతో కలిసి ఆవిష్కరించారు.ఈ సందర్భంగా కొలన్ హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ..ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా నిలుస్తూ..నిత్య నూతన కథనాలతో ప్రజా సమస్యలే పరిష్కారం లక్ష్యంగా విశాలాంధ్ర దినపత్రిక పనిచేయడం అభినందనీయమన్నారు.రానున్న రోజుల్లో విశాలాంధ్ర దినపత్రిక మరింత అభివృద్ధి చెందలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ కాంగ్రెస్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి,ఎన్.ఎం.సి అధ్యక్షులు రాజశేఖర్ రెడ్డి,డివిజన్ అధ్యక్షులు,యువజన కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# బీసీ డిక్లరేషన్ను వెంటనే అమలు చేయాలి

■ మండల అధ్యక్షులు ఎముల నవీన్

**కోటగిరి,స్నేహిత ఎక్స్ ప్రెస్:** తెలంగాణ రాష్ట్ర జనాభాలో 50 శాతం ఉన్న బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ప్రకటించాలని కోటగిరి మండల బిజెపి పార్టీ అధ్యక్షులు ఎముల నవీన్ డిమాండ్ చేశారు.మంగళవారం మండల బిజెపి నాయకులు కోటగిరి ఎమ్మార్వో కార్యాలయం నందు బీసీ డిక్లరేషన్ అమలు పరచాలని మెమొరండం ఇచ్చారు.ఈ సందర్భంగా ఎముల నవీన్ మాట్లాడుతూ..సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికల సందర్భంగా కామారెడ్డి సభలో కాంగ్రెస్ ఇచ్చిన బీసీ డిక్లరేషన్ హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో హామీ నెరవేరేవంతవరకు గ్రామస్థాయి నుండి ఉద్యమం చేపట్టి బీసీలకు న్యాయం జరిగేంత వరకు పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఓబిసి మోర్చ అసెంబ్లీ కన్వీన నాగం సాయిలు,ఓబీసీ మండల ప్రధాన కార్యదర్శి శివశంకర్,బూత్ అధ్యక్షులు వాసు,గంగాధర్, జగదీష్,భాస్కర్,కార్యకర్తలు పాల్గొన్నారు.



# ప్రతిపక్ష నాయకుల పై అక్రమ కేసులు పెడుతున్న కాంగ్రెస్

- కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్న రేవంత్ రెడ్డి
- తెలంగాణ రాష్ట్రంలో అధోగతి పాలన
- చిల్లర రాజకీయాలు చేస్తున్న రేవంత్ రెడ్డి
- ఓటుకు నోటు కేసులో రేవంత్ రెడ్డి జైలుకు పోక తప్పదు
- ప్రజలకు ఇచ్చిన 6 గ్యారంటీలను 420 హామీలను తప్పకుండా కాంగ్రెస్ అమలు చేయాలి
- బిఆర్.టి.యు రాష్ట్ర ఉపాధ్యక్షులు భూమోల్ల కృష్ణయ్య



**వికారాబాద్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** తెలంగాణలో ప్రతిపక్ష నాయకులపై అక్రమ కేసులు పెడుతున్న కాంగ్రెస్ పార్టీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,ప్రతిపక్ష నాయకులపై అక్రమ కేసులు బనాయిస్తూ,కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతూ తెలంగాణ రాష్ట్రాన్ని అధోగతి పాలు చేస్తున్నాడని ఇలా అయితే భవిష్యత్తులో తెలంగాణ రాష్ట్రంలో ఆర్థిక సంక్షోభ రాష్ట్రంగా రాష్ట్రంగా కక్ష సాధింపుల రాష్ట్రంగా,తెలంగాణ రాష్ట్రం తయారవుతుందని,బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, బిఆర్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు,టైగర్ భూ మోల్ల కృష్ణయ్య ఆందోళన వ్యక్తం చేశారు.ఫార్ములా ఈ కార్ రేస్ లో అవినీతి జరగలేదని,కేటీఆర్ మొత్తుకుంటున్న,ఎలాగైనా కేటీఆర్ నీ జైలుకు పంపాలననే, కక్షసాధింపు చర్యల్లో భాగంగానే రేవంత్ రెడ్డి వ్యవహారశైలి ఉన్నదని విమర్శించారు.స్వతంత్ర సంవత్సలైన ఏసీబీనీఈడిలను, కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం లాగే, రాష్ట్రంలో రేవంత్ రెడ్డి కుడా వాడుకుంటున్నారని, విమర్శించారు .గతంలో కేటీఆర్ నీ వల్ల బావ ఇల్లు దావత్ లో,లగచర్ల రైతుల కేసులో, ఇరికించడానికి ప్రయత్నం చేసినప్పటికీ,రేవంత్ రెడ్డి నవ్వుల పాలు కావడం జరిగిందని ఎద్దేవా చేశారు.ఈ కార్ రేస్ లో ఒక ప్రభుత్వం ,మంత్రిగా, తీసుకున నిర్ణయాలకు కేటీఆర్ ఎలా బాధ్యుడు అవుతాడని? ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని, ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డినీ, వారు చేస్తున్న అవినీతినీ,ఎన్నికల ముందు ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయాలని ప్రశ్నిస్తునందుకే, కేటీఆర్ ఎలాంటి తప్పులు చేయకున్నా అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపాలని చూస్తున్నాడని విమర్శించారు. బిఆర్ఎస్ పార్టీ నాయకులకు కేసులు,జైలు,కొత్తేమీ కాదని, అన్నారు. రేవంత్ రెడ్డి తతంగాన్ని అంత తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారని కృష్ణయ్య అన్నారు.రేవంత్ రెడ్డి తెలంగాణలో చిల్లర రాజకీయాలు చేస్తూ.. కక్షసాధింపు రాజకీయాలకు పాల్పడుతున్నాడని, మళ్లీ కాంగ్రెస్ నాయకులకు రేవంత్ రెడ్డికి వచ్చే బిఆర్ఎస్ ప్రభుత్వంలో ఇదే గతి పడుతుందని హెచ్చరించారు. ఐఏఎస్, అధికారులను,ఇతర అధికారుల పైన,రేవంత్ రెడ్డి అక్రమ కేసులు బనాయించి,జైల్లో పెడుతుంటే, భవిష్యత్తులో అధికారులు ఎలా? పని చేస్తారని ఆందోళన వ్యక్తం చేశారు.రేవంత్ రెడ్డి ముఖ్య మంత్రి అయ్యాక రాష్ట్రంలో అభివృద్ధి కుంటు పడిందని,పెట్టుబడులు రావడం లేదని,రియల్ ఎస్టేట్, మరియు నిర్మాణ రంగం ఇతర, రంగాలు రాష్ట్రంలో కుప్పకూలయని, దీంతో రాష్ట్రంలో ఆర్థిక సంస్కోభం ప్రారంభం అయింది అని ఆందోళన వక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ ర్టీ,రేవంత్ రెడ్డి ప్రభుత్వం,పాలన ఇలాగే కొనసాగితే, భవిష్యత్తులో తెలంగాణ ప్రజలు అనేక ఇబ్బందులు ఎదురుకు ంటారని అనారు.ఓటుకునోటు కేసులో, అవినీతి కేసుల్లో,రేవంత్ రెడ్డి, వారి మంత్రి వర్గ సహచరులు, జైలుకు పోక తపదని హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ ,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కక్షసాధింపు రాజకీ యాలు మానుకొని ఎన్నికల ముందు ప్రజలకిచ్చిన ఆరు గ్యారంటీలను 420 హామీలను తప్పక హామలు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా రేవంత్ రెడ్డి,కేటీఆర్ పైన,బిఆర్ఎస్ పార్టీ నాయకుల పైన,పెట్టిన అక్రమ కేసులను, ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కాంగ్రెస్ పార్టీ ప్రజలకిచ్చిన ఆరు గ్యారంటీల పై,420 హామీలపై,అమలు చేసే వరకు బిఆర్ఎస్ పార్టీ పోరాటం చేస్తూనే ఉంటదని తెలియ చేశారు. ఇప్పటికైనా రేవంత్ రెడ్డి ప్రభుత్వం, బిఆర్ఎస్ పార్టీ నాయకులపై కక్ష సాధింపు చర్యలు మానుకొని, ప్రజలకిచ్చిన ఓహామీలపై దృష్టి సారించాలని,హితవు పలికారు.



## అంగన్వాడీ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన తహసిల్దార్

**సిరికొండ,స్నేహిత ఎక్స్ ప్రెస్:** మండలంలో అంగన్వాడి కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన తహసిల్దార్ సిరికొండ మండలంలో మంగళవారం అంగన్వాడి కేంద్రాలు ఆకస్మికంగా తనిఖీ చేసిన సిరికొండ తహసిల్దార్ ఆర్.రవీందర్ రావు,తహసిల్దార్ వారితో మాట్లాడుతూ..ఉదయం సాయంత్రం పిల్లలకు స్నాక్స్ కచ్చితంగా ఇవ్వాలని వారికి సూచించారు. పిల్లలకు,బాలింతలకు మంచి పౌష్టికమైన ఆరం అందించాలి. చుట్టూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి,వంట చేసే పాత్రలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో తహసిల్దార్ ఆర్.రవీందర్ రావు,అంగన్వాడి టీచర్స్ తదితరులు ఉన్నారు.

## బిజెపి రాష్ట్ర కార్యాలయంపై జరిగిన దాడిని ఖండించిన కమ్మరి భూపాలాచారి



**చౌడాపూర్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** బిజెపి రాష్ట్ర కార్యాలయంపై కాంగ్రెస్ ముఖలు పాల్పడిన దాడి పట్ల జిల్లా బిజెపి పార్టీ అధ్యక్షుడు కమ్మరి భూపాల చారి ఖండిస్తూ,తీవ్ర అగ్రహం వ్యక్తం చేస్తూ ఈ దాడికి పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్,బాధ్యత వాహిస్తూ సమాధానం చెప్పాలని డిమాండ్ చేయడం జరిగింది. పార్టీ కార్యాలయాలపై రాళ్లు,కోడిగుడ్లు వేయడాలు ప్రజాస్వామ్యంలో ఇది సమాజసం కాదని చట్ట వ్యతిరేక పనులను కాంగ్రెస్ పార్టీ ప్రోత్సహిం చడం మూర?త్వాపు చర్య అని కాంగ్రెస్ పార్టీ మూకాలను కమ్మరి భూపాలచారి హెచ్చరించడం జరిగింది. ఎవరైనా తప్పుడు వాక్యాలు చేసినట్లయితే ప్రజాస్వామ్యబద్ధంగా ఖండించాల్సినటువంటి అవసరం ఉందని, అవసరమైతే చట్టపరంగా కూడా శిక్షించవచ్చు, అంతేకాని రాష్ట్రంలో అధికారం చేతిలో ఉంది అని చట్టాన్ని చేతిలోకి తీసుకొని భయభ్రాంతులకు గురి చేస్తూ.. కార్యాలయాల పైన దాడులకు తెగబడడం దుర్మార్గమైన చర్యగా భావిస్తూ కార్యాలపై దాడికి పాల్పడ్డ కాంగ్రెస్ పార్టీ మూకలను అరెస్టు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## బిజెపి రాష్ట్ర కార్యాలయం పై దాడి చేయడం హేమమైన చర్య

- చౌడాపూర్ మండల బీజేపీ పార్టీ అధ్యక్షుడు బందయ్య



**చౌడాపూర్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** బిజెపి రాష్ట్ర కార్యాలయంపై కాంగ్రెస్ ముఖలు పాల్పడిన దాడి పట్ల చౌడాపూర్ మండల బిజెపి పార్టీ అధ్యక్షుడు బందయ్యా ఖండిస్తూ..తీవ్ర అగ్రహం వ్యక్తం చేస్తూ ఈ దాడికి పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ బాధ్యత వాహిస్తూ సమాధానం చెప్పాలని డిమాండ్ చేయడం జరిగింది.పార్టీ కార్యాలయాలపై రాళ్లు,కోడిగుడ్లు వేయడాలు ప్రజాస్వామ్యంలో ఇది సమాజసం కాదని చట్ట వ్యతిరేక పనులను కాంగ్రెస్ పార్టీ ప్రోత్సహించడం మూర?త్వాపు చర్య అని కాంగ్రెస్ పార్టీ మూకాలను బందయ్యు హెచ్చరించడం జరిగింది. ఎవరైనా తప్పుడు వాక్యాలు చేసినట్లయితే ప్రజాస్వామ్యబద్ధంగా ఖండించాల్సి నటువంటి అవసరం ఉందని,అవసరమైతే చట్టపరంగా కూడా శిక్షించవచ్చు,అంతేకాని రాష్ట్రంలో అధికారం చేతిలో ఉంది అని చట్టాన్ని చేతిలోకి తీసుకొని భయభ్రాంతులకు గురి చేస్తూ కార్యాలయాల పైన దాడులకు తెగబడడం దుర్మార్గమైన చర్యగా భావిస్తూ కార్యాలపై దాడికి పాల్పడ్డ కాంగ్రెస్ పార్టీ మూకలను అరెస్టు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## అబద్ధపు హామీలతో రైతులను మోసం చేస్తున్న కాంగ్రెస్




- కోటగిరిలో డిఆర్ఎస్ నాయకుల ధర్నా రాస్తారోకో
- రైతులకు రైతు బంధు రూ.15 వేలు అందించాలి

**కోటగిరి,స్నేహిత ఎక్స్ ప్రెస్:** అబద్ధపు హామీలతో కాంగ్రెస్ పార్టీ గద్దెకెక్కి రైతులను మోసం చేసిందని. ఎన్నికల సమయంలో రైతులకు రైతు భరోసా పేరున ఎకరానికి 15000 ఇస్తానని చెప్పి ఇప్పుడు 12000 ఇస్తానని చెప్పడం రైతులను మోసం చేయడమేనని బాన్సువాడ టిఆర్ఎస్ నాయకులు ఎస్కే జుబేర్ పేర్కొన్నారు. బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు మంగళవారం కోటగిరి మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ఆయన మండల నాయకులతో కలిసి ప్రధాన రహదారిపై బైటాయించి కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ధర్నా రాస్తారోకో నిర్వహించారు.ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ..కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది అయినా ఇప్పటివరకు రైతులకు రైతు భరోసా ఇచ్చిందే లేదన్నారు. ఎన్నికల సమయంలో రైతులకు రైతు భరోసా కింద ఎకరానికి రూ.15000 ఇస్తానని చెప్పి ఇప్పుడు రూ.12000 ఇస్తానని చెప్పడం సరైన పద్ధతి కాదన్నారు. ఇప్పటికే కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసాను ఒక సంవత్సరం ఎగరగొట్టిం దని.ఈ ఎగర కొట్టిన డబ్బులను కలిపి వెంటనే రైతుల ఖాతా లో వెంటనే జమ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.మిగిలి న రైతు రుణమాఫీని తేల్చకుండా తాస్కారం చేస్తుందని.వెంటనే రైతులకు సంపూర్ణ రుణమాఫీని కల్పించాలన్నారు. అదేవిధంగా ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించిన 18 సం.లు నిండిన ప్రతి మహిళకు రూ.2500,వృద్ధులకు రూ.4000, వికలాంగులకు రూ.6000 పెన్షన్ ఇవ్వాలని. ఆడపడుచుకు ఒక లక్ష తులం బంగారం వెంటనే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు తాజా మాజీ ఎంపిటిసి ఫారుక్,నవీన్ కుమార్,సమీర్,ఆరిఫ్,తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ మోమిన్ పేట్ మండల శాఖ క్యాలండర్ ఆవిష్కరణ




**మోమిన్ పేట్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ అధ్యక్షులు సమ్మయ్య అధ్యక్షతన క్యాలెండర్-2025 ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కాంగ్రెస్ మండల అధ్యక్షులు శంకర్ యాదవ్ మరియు మోమిన్ పేట్ మండలం ఎంపీడీవో విజయలక్ష్మి మరియు టీఎస్ యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు వెంకటరత్నం కాంగ్రెస్ పార్టీ మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్ రెడ్డి,మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ సిరాజుద్దీన్,సుభాష్ గౌడ్,మండల సీనియర్ నాయకులు మహంతి స్వామి,యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు సుభాష్,మండల జనరల్ సెక్రెటరీ కే.సురేందర్, మరియు వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయురాలు ఈ కార్యక్రమంలో పాలుపంచుకోవడం జరిగింది. విద్యార్థులకు శాస్త్రీయ దృక్పథంతో విద్యను అందించాలి.టీఎస్ యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు సిహెచ్.వెంకటరత్నం,విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని అన్నారు.ఎంపీడీవో మాట్లాడుతూ..మోమిన్ పెట్ విద్యార్థులందరికీ శాస్త్రీయ దృక్పథంతో కూడిన విద్యను అందించాలని మానవత విలువలతో కూడిన విద్యార్థి దేశ అభివృద్ధికి సహాయపడుతుందని తెలంగాణ రాష్ట్రంలో మానవత విలువలతో కూడిన విద్యను అందించాలని అన్నారు.ఈ కార్యక్రమానికి హాజరైన టీఎస్ యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు సిహెచ్.వెంకటరత్నం మాట్లాడుతూ..విద్యార్థులు చిన్ననాటి నుండి శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకునేలా తల్లిదండ్రులు ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. రోజురోజుకు మానవ సంబంధాలు దిగజారుతున్నాయని వాటిని కొనసాగించవలసిన బాధ్యత తల్లిదండ్రులపై సమాజంపై ఎంతైనా ఉందని వారు అన్నారు. తల్లిదండ్రులు పిల్లలకు సెల్ ఫోన్లు సోషల్ మీడియాకు దూరంగా ఉంచాలని వారినీ నిరంతరం గమనించాలని అన్నారు.


## సిర్గాపూర్ మండలానికి అంబులెన్స్ కేటాయించడంపై హర్షం

**నారాయణఖేడ్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** సిర్గాపూర్ మండలానికి నూతనంగా 108 అంబులెన్స్ కేటాయించడంపై బీజేపీ సీనియర్ నాయకులు అరుణ్ రాజ్ శేరికర్ హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఆయన మంగళవారం మాట్లాడుతూ.. నారాయణఖేడ్ నియోజకవర్గంలో సిర్గాపూర్ మండలం ఏర్పాటు నుండి ఇప్పటివరకు 108 అంబులెన్స్ లేకపోవడంతో మండలం ప్రజలకు అత్యవసర సమయాల్లో ఇబ్బందులు ఏర్పడ్డాయని తెలిపారు.ఈ మేరకు అంబులెన్స్ కోసం తాము పోరాటం చేశామని గుర్తు చేశారు.ప్రభుత్వం స్పందించి అంబులెన్స్ ఇవ్వడం పట్ల ప్రభుత్వానికి మరియు స్థానిక ఎమ్మెల్యే సంజీవరెడ్డికి మండల ప్రజల తరఫున ధన్యవాదాలు తెలియజేశారు.




## కోటగిరిలో స్వామి వివేకానంద నూతన కాంస్య విగ్రహా విష్కరణ

**కోటగిరి,స్నేహిత ఎక్స్ ప్రెస్:** రామకృష్ణ సేవా సమితి కోటగిరి వారి ఆధ్వర్యంలో శ్రీ వివేకానంద హై స్కూల్ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన స్వామి వివేకానంద నూతన కాంస్య విగ్రహాన్ని విగ్రహ దాత మాజీ జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు బీబీ పాటీల్,రామకృష్ణ మఠం హైదరాబాద్ అధ్యక్షులు స్వామి బోదామయానందాజీ,అఖిల భారత సామాజిక సమరసత కళావిభాగం కన్వీనర్ అప్పాల ప్రసాద్,పివి సుబ్బారావు ల చేతుల మీదుగా మంగళవారం అంగరంగ వైభవంగా వేలాది మంది వివేకానంద అభిమానుల మధ్యన ప్రారంభించారు.ఈ సందర్భంగా బీబీ పాటీల్, బోదామయానందాజీ,అప్పాల ప్రసాద్,పివి సుబ్బారావు మాట్లాడుతూ..నేటి సమాజంలో ప్రాచాత్య సాంస్కృతిని అనుకరించడం వలన భారత దేశ ప్రాచీన సాంప్రదాయ,సాంస్కృతిక విలువలు తగ్గాయన్నారు.ప్రతి ఒక్కరు స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకొని వారి ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరు నేర్చుకోవాలని అన్నారు ప్రపంచంలో యువతరం అత్యధికంగా ఉన్న దేశం భారతదేశం అని చెప్పడానికి గర్వంగా ఉందన్నారు.అందుకే నేటి యువతరం స్వామి వివేకనంద అడుగుజాడలో నడవాలని నేటి యువత స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకోవా లని పిలుపునిచ్చారు.రామకృష్ణ పరమహంస స్వామి వివేకా నంద ఇరువురు కలియుగంలో అవతరించిన భగవాన్ స్వరూపులని పేర్కొన్నారు భారతదేశంలో భిన్నమైన నైసర్గిక స్వరూపాలు, శీతోష్ణస్థితులు, భాషాలు ,యాసలు ,దైవారాధనలు ఉన్నాయని.ప్రపంచానికి జ్ఞానాన్ని ప్రబోధించే ఏకైక దేశం భారతదేశం అని అన్నారు.ప్రపంచవ్యాప్తంగా 58 దేశాలు తమ సంస్కృతిని కాలగర్భంలో కలిసిపోయిన భారతీయ సంస్కృతి నిరంతరంగా నిలబడి కొనసాగుతు న్నదంటే ఋషులు, మును లు,మహా పురుషుల యొక్క గొప్పతనం అని కొనియాడారు.మన సంస్కృతిని ప్రతితరం నందు కొందరి మహానుభావుల వల్ల నిత్య నూతనంగా ప్రజ్వలిల్లుతున్నదని అందులో ముఖ్యంగా భారతదేశ సనాత ధర్మాన్ని విశ్వ వ్యప్తం చేసిన మహానీయు లు స్వామి వివేకానందాన్ని కొనియాడారు.ఈ కార్యక్రమంలో కోటగిరి వర్ని బోధన్ మండలాలలోని పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఉపాధ్యాయులు, రామకృష్ణ పరమహంస ,స్వామి వివేకానంద అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## పద్మశాలి సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శిగా డా.పెండెం.నాగభూషణం



**కుత్బుల్లాపూర్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శిగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని చింతల్ కు చెందిన డా.పెండెం.నాగభూషణం ఎన్నికయ్యారు.ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం అధ్యక్షులు వల్లకాటి రాజ్ కుమార్ డా.పెండెం. నాగభూషణంకి తెలంగాణ రాష్ట్ర కమిటీలో సహాయ కార్యదర్శిగా నియమిస్తూ..నియామక పత్రాని అందజేశారు.ఈ సందర్భంగా డాపెండెం. నాగభూషణం మాట్లాడుతూ..నియామక పత్రం అందజేసినందుకు చాలా ధన్యవాదాలు తెలియజేస్తున్నారు.ఈ కార్యక్రమంలో అప్పం శ్రీనివాసరావు, సామల వెంకటేశం ఒడిచేర్ల మారుతి,వల్లకాటి శ్రీను విష్ణు,గోవర్ధన్, ఆంజనేయులు మరియు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఖేడ్ ప్రభుత్వ వైద్యశాలకు రెండు వీల్ చైర్ ల పంపిణీ

**నారాయణఖేడ్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** ప్రతి ఒక్కరు సమాజ శ్రేయస్సు కోసం పాటుపడాలని అందుకు దాతృత్వ గుణాన్ని పెంపొం దించుకోవాలని ప్రభుత్వ వైద్యశాల సూపరిం డెంట్ డాక్టర్ రమేష్ అన్నారు. మంగళవారం నాడు శాసనసభ్యులు సంజీవరెడ్డి సూచనలతో లైన్స్ సభ్యులు వెంకట్రావు,చంద్రశేఖర్ ఆచార్య, రాజ్ కుమార్ ఆధ్వర్యంలో రెండు వీల్ చైర్ లను ప్రభుత్వ హాస్పిటల్ కు అందజ ేయడం జరిగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మార్మూల ప్రాంతమైన నారాయణఖేడ్ లో పేద బడుగు బలహీన వర్గాల ప్రజలకు ఉపయుక్తంగా ప్రభుత్వ వైద్యశాల ఉందని దీనిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. సోమవారం జరిగిన హాస్పిటల్ డెవలప్మెంట్ సొసైటీ సమావేశంలో వైద్యుల కోరిక మేరకు ఆసుపత్రుల్లో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో మౌలిక వసతుల ఏర్పాటుకు కృషి జరుగుతుందని, అందులో భాగంగానే ప్రస్తుతం రెండు వీల్ చైర్ లు అందించడం జరిగిందని, రాబోవు రోజుల్లో మరిన్ని మౌలిక వసతుల కోసం ఎమ్మెల్యే సంజీవరెడ్డి అందించున్నారని వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో లైన్స్ క్లబ్ అధ్యక్షులు వెంకట్రావు , సభ్యులు చంద్రశేఖర్ ఆచార్య,రాజ్ కుమార్,నాయకులు శంకర్ ముదిరాజ్,వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# ఉద్యమ కళాకారుల త్యాగం గొప్పది

- మందకృష్ణ మాదిగ
- లక్ష డప్పులు వేల గొంతుల సభకు కళాకారుల పూర్తి మద్దతు: అనుముజు వెంకటేష్
- ఎస్సీల ఏబిసిడి వర్గీకరణ అమలు చేయాలి : దరువు అంజన్న
- లక్ష డప్పులు వేల గొంతులై కదులుతాం: నకరికంటి కిరణ్




**కుత్బుల్లాపూర్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** ఎస్సీల ఏబిసిడి వర్గీకరణ అమలుకై చేపట్టిన లక్ష డప్పులు - వేల గొంతులు మహా ప్రదర్శనకు తెలంగాణ ఉద్యమ నిరుద్యోగ కళాకారుల పూర్తి మద్దతు ఉంటుందని కౌలు కళాకారులు హామీ ఇచ్చారు.సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో జరిగిన లక్షల డప్పులు - వేల గొంతులు మద్దతు సభకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన మందకృష్ణ మాదిగ మాట్లాడుతూ..గత 30 సంవత్సరాలుగా మాదిగ మాది ఉపకులాల గురించి జరుగుతున్న పోరాటం చివరి దశకు వచ్చిందని, కమిటీలన్ని అనుకూలంగా ఉన్న, సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన కానీ సోదరులు అడ్డుపడడం పద్ధతి కాదని సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ వెంటనే అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.మాదిగ జాతి చేస్తున్న ఈ ఉద్యమానికి కళాకారులు మద్దతు తెలుపడం హర్శించదగ్గ విషయమని అన్నారు.గత పది సంవత్సరాలుగా అనుమొజు వెంకటేష్ ఆధ్వర్యంలో సుదీర్ఘంగా చేస్తున్న కళాకారుల ఉద్యమానికి నా మద్దతు పూర్తిగా ఉంటుందని మందకృష్ణ మాదిగ మద్దతు తెలియజేశారు.కళాకారుల హక్కుల సాధనకై ఉద్యోగాలు వచ్చేలా నేను సీఎంతో మాట్లాడతానని హామీ ఇచ్చారు. ఉద్యమం అన్నప్పుడు చాలా రకాల పరిణామాలు ఉంటాయని వాటిని సర్దుకొని ముందుకు నడవాలని ఆయన హితువు పలికారు.

### కృష్ణన్న చేస్తున్న ఉద్యమానికి కళాకారుల మద్దతు

మాదిగ,మాదిగ ఉప కులాల హక్కుల సాధనకై చేస్తూన్న ఉద్యమానికి కళాకారుల పూర్తి మద్దత్తు ఉంటుందని,తెలంగాణ ఉద్యమ నిరుద్యోగ కళాకారుల సంఘం రాష్ట్ర నేత అనువోజు వెంకటేశం అన్నారు. నిరుద్యోగ కళాకారులకు ఉద్యమానికి మంద కృష్ణ మద్దతూ ఉండాలని కోరారు.

### మందకృష్ణ ఒక వ్యక్తి కాదు...

మందకృష్ణ అన్న చేస్తున్న ఉద్యమం,ఏబీసీడీ వర్గీకరణ నూటికి నూరుపాళ్ళు ప్రజాస్వామీకమని,కనుక తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా అమలు చేయాలన్నారు.గత తెరాస ప్రభుత్వం కళాకారులకు అన్యాయం చేసిందని,కొత్తగా ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం కళాకారులకు చేయాలన్నారు.

### లక్ష డప్పులు - వేల గొంతులై సాగుతాం

అణగారిన వర్గాల అభ్యున్నతికై కొనసాగుతున్న ఈ మహెూద్యమానికి కృష్ణన్న వెంబడి సాగుతామణి,మా కళాకారుల ఉద్యమానికి మద్దత్తు ఇస్తున్నందుకు ధన్యవాదములు అని తెలంగాణ ఉద్యమ నిరుద్యోగ కళాకారుల సంఘం రాష్ట్ర నేత నకిరకంటి కిరణ్ అన్నారు.ఈ కార్యక్రమంలో డా.పృథ్విరాజ్ యాదవ్,వెంకటేష్ నేత,దండోరా కళా మండలి రాష్ట్ర అధ్యక్షులు యన్.వై అశోక్,అంతడుపుల నాగరాజు,మిట్టపల్లి సురేందర్, దరువు ఎల్లన్న,నలిగంటి శరత్, పాటమ్మ రాంబాబు,మాట్లా తిరుపతి, చంద్రశేఖర్,మురళి, కళాకారుల సంఘం నేతలు,గణేష్, చిరంజీవి,సైదులు,రాచకొండ రమేష్, రమా, ఫకృద్దీన్,తదితరులు పాల్గొన్నారు.

## విశ్వవేదికపై తెలంగాణ క్రీడారంగం

- స్పోర్ట్స్ వర్సిటీతో అభివృద్ధికి యత్నం
- ప్రపంచ దేశాల్లో నైపుణ్యాల పరిశీలన
- సింగపూర్ పర్యటనలో అధ్యయనం చేయనున్న రేవంత్

**హైదరాబాద్,జనవరి7(ఆర్ఎన్ఎ):** తెలంగాణ రాష్ట్రం క్రీడా రంగంలో కీలకమైన అడుగులు వేయబోతోంది. క్రీడా వర్సిటీ కోసం చేస్తున్న యత్నాలు ఫలిస్తే తెలంగాన క్రీడారంగంలో దూసుకుపోవడం ఖాయం. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి క్రీడాభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారిస్తూ, దేశంలోని అత్యంత ఆధునిక స్థాయిలో లక్ష మంది కూర్చునే సామర్థ్యం కలిగిన భారీ స్టేడియాన్ని నిర్మించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ ప్రాజెక్ట్ ఫ్యూచర్‌సిటీలో లేదా మరో ప్రాంతంలో 100 ఎకరాల్లో ఏర్పాటు చేయాలని ప్రాథమికంగా నిర్ణయించారు. ఈ స్టేడియంలో అత్యాధునిక సాంకేతికతతో క్రికెట్, ఫుట్‌బాల్ వంటి వివిధ క్రీడలకు అనువైన మైదానాలను రూపొందిస్తారు. రాష్ట్రంలోని క్రీడాకారులకు ప్రపంచ స్థాయి శిక్షణ, మౌలిక సదుపాయాలు అందించడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. ఈ ప్రాజెక్ట్ ద్వారా తెలంగాణను క్రీడల కేంద్రంగా మార్చాలన్నది సీఎం రేవంత్ రెడ్డి దృష్టిగా ఉంది. దీనికి సంబంధించిన ప్లానింగ్ వంటి అంశాలపై అధ్యయనం చేస్తారు. 18న సింగపూర్ లో పర్యటించనున్న సీఎం, అక్కడి మల్టీ-యూజ్ స్పోర్ట్స్ ఫెసిలిటీస్, ట్రాఫిక్ నిర్వహణ పద్ధతులు, క్రీడా మైదానాల నిర్వహణపై అవగాహన పెంపొందించుకుంటారు. సింగపూర్‌లో చిన్న దేశంగా ఉన్నప్పటికీ, ఒలింపిక్స్ మెడల్స్ సాధించడంలో తీసుకుంటున్న ప్రత్యేక చర్యలను పరిశీలిస్తారు. ప్రస్తుతం గుజరాత్‌లోని మోతేరా స్టేడియం దేశంలోనే అతిపెద్దది, 1.32 లక్షల మంది సామర్థ్యంతో ఉంది. తెలంగాణలో నిర్మించబోయే ఈ కొత్త స్టేడియం గుజరాత్ స్థాయికి తగ్గదిగా ఉండేలా చర్యలు తీసుకుం టున్నారు. ఈ మైదానం అంతర్జాతీయ స్థాయిలో క్రికెట్ టోర్నమెంట్లు, ఐపీఎల్ మ్యాచ్‌లకు కేంద్రంగా మారుతుందని అంచనా .క్రీడాభివృద్ధిపై మరింత అవగాహన పొందేందుకు సీఎం రేవంత్ రెడ్డి ఈ నెల 15, 16 తేదీల్లో ఆస్ట్రేలియా పర్యటనకు సిద్ధమవుతున్నారు. అక్కడి క్రీడా మైదానాలు, శిక్షణా విధానాలు, ప్లానింగ్ వంటి అంశాలపై అధ్యయనం చేస్తారు. 18న సింగపూర్ లో పర్యటించనున్న సీఎం, అక్కడి మల్టీ-యూజ్ స్పోర్ట్స్ ఫెసిలిటీస్, ట్రాఫిక్ నిర్వహణ పద్ధతులు, క్రీడా మైదానాల నిర్వహణపై అవగాహన పెంపొందించుకుంటారు. సింగపూర్‌లో చిన్న దేశంగా ఉన్నప్పటికీ, ఒలింపిక్స్ మెడల్స్ సాధించడంలో తీసుకుంటున్న ప్రత్యేక చర్యలను పరిశీలిస్తారు. తెలంగాణలో ఇప్పటికే 760 ఎకరాల్లో స్పోర్ట్స్ హబ్‌ను ఏర్పాటు చేశారు. దీనికి తోడు ఇప్పుడు ఈ భారీ ప్రాజెక్ట్ రాష్ట్ర క్రీడారంగానికి దిశానిర్దేశర చేయనుంది.

## కొరకరాని కొయ్యగా బైడెన్ నిర్ణయాలు

- సహజవాయు డ్రిల్లింగ్‌పై ఆంక్షలపై అభ్యంతరం
- అధికారంలోకి రాగానే సమీక్షిస్తానన్న ట్రంప్



**వాషింగ్టన్,జనవరి7(ఆర్ఎన్ఎ):** అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ అధ్యక్షుడిగా తన చివరి సమయంలో తీసుకున్న అధికారిక నిర్ణయాలు, చర్యలతో పరిపాలనను, అధికార బదిలీని కష్టతరం చేశారని కాబోయే అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆరోపించారు. తాను అధికారం స్వీకరించడానికి ముందే ఎన్ని కష్టతరమైన మార్పులు సాధ్యమో అన్నీ చేస్తున్నారని మండిపడ్డారు. న్యాయవ్యవస్థలో ఇలా జరగడం మునుపెన్నడూ చూడలేదని పేర్కొన్నారు. ఖరీదైన, అర్థంలేని పరిపాలనా ఉత్తర్వులు ఇచ్చి గ్రీన్ న్యూ స్కామ్, ఇతర రకాలుగా డబ్బును వృథా చేస్తున్నారని మండిపడ్డారు. ఈ ఉత్తర్వుల విషయంలో అమెరికా ప్రజలు భయపడాల్సిన పనిలేదని, తాను అధికారం చేపట్టగానే వాటిని తొలగిస్తానన్నారు. తన పరిపాలనలో అమెరికాను మరింత శక్తివంతమైన దేశంగా నిలబెడతానన్నారు. ఇప్పటికే తాము రూపొందించిన డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫిషియెన్సీ ద్వారా ప్రభుత్వ వ్యయాలను తగ్గించడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. కాగా అమెరికా తీర ప్రాంతంలో చమురు, సహజవాయువు కోసం చేసే డ్రిల్లింగ్‌ను బైడెన్ నిషేధించారు. కాలిఫోర్నియా, ఒరెగాన్, తూర్పుగల్ఫ్ ఆఫ్ మెక్సికో మొదలైన ప్రదేశాల్లో 625 మిలియన్ ఎకరాల తీర ప్రాంతంలో ఆయిల్, గ్యాస్ డ్రిల్లింగ్‌లు చేపట్టకుండా చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. దేశీయ ఇంధన ఉత్పత్తిని ప్రోత్సహిస్తామని వాగ్దానం చేసిన ట్రంప్ ప్రమాణస్వీకారం చేయడానికి కొద్ది రోజుల ముందు బైడెన్ ఈ చర్యలు తీసుకోవడం గమనార్హం. అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ ఎన్నికను అమెరికా కాంగ్రెస్ సోమవారం లాంఛనంగా ధ్రువీకరించింది. గొప్ప ఎన్నికల్లో సాధించిన ఘన విజయాన్ని కాంగ్రెస్ ధ్రువీకరించడం చరిత్రలో పెద్ద పరిణామమని ట్రంప్ పేర్కొన్నారు. ట్రంప్‌పై పోటీచేసి ఓడిపోయిన ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ ఆయన విజయాన్ని ధ్రువీకరించే లాంఛనప్రాయ క్రతువుకు అధ్యక్షత వహించారు. అధికార బదలాయింపు శాంతియుతంగా జరిగేలా చూడడం తన పవిత్ర కర్తవ్యమని ఆమె ఒక వీడియో సందేశంలో పేర్కొన్నారు. ప్రజాస్వామ్యం ఎంతటి సున్నితమైనదో చూస్తున్నామని, అధికార మార్పిడి సాఫీగా పూర్తయ్యేందుకు అందరూ మద్దతుగా నిలవాల్సిన అవసరం ఉందని చెప్పారు.అమెరికాకు కాబోయే అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు వీలైనన్ని ఇబ్బందులు సృష్టించే పనిలోపడ్డారు ప్రస్తుత అధ్యక్షుడు జోబైడెన్. తాజాగా ట్రంప్ లక్ష్యమైన గ్యాస్, చమురు డ్రిల్లింగ్ పనులు ముందుకువెళ్లకుండా ఆయన ఏకంగా 75 ఏళ్ల నాటి ఓ చట్టాన్ని తెర పైకి తీసుకొచ్చారు. అమెరికా సముద్ర జలాల్లో దాదాపు 62 కోట్ల ఎకరాల ప్రదేశాన్ని ఆయిల్, గ్యాస్ డ్రిల్లింగ్ నుంచి కాపాడేందుకు దీనిని వాడనున్నారు. ఈ విషయాన్ని సోమవారం శ్వేతసౌధం ప్రకటించింది. శిలాజ ఇంధన ఉత్పత్తిని పెంచాలన్న ట్రంప్ ప్లాన్ అమలును ఇది మరింత జఠిలం చేయనుంది. 1953 ఔటర్ కాంటినెంటల్ షెల్ఫ్ ల్యాండ్ యాక్ట్ ఇందుకోసం బైడెన్ వాడుతున్నారు. దీని ప్రకారం చమురు, గ్యాస్ డ్రిల్లింగ్ నుంచి ఔటర్ కాంటినెంటల్ షెల్ఫ్‌ను పూర్తిగా మినహాయించే అధికారం అధ్యక్షుడికి లభిస్తుంది. తూర్పు, పశ్చిమతీరాలు, తూర్పు గల్ఫ్ మెక్సికో, అలాస్కాలోని ఉత్తర బేరింగ్ సముద్రం వంటివి వీటి కిందకు వస్తాయి. అంతేకాదు.. అసలు ఈ చట్టం తర్వాత వచ్చే అధ్యక్షుడికి దానిని అడ్డుకొనే శక్తిని ఇవ్వదు. దీనిని ఆపాలంటే ట్రంప్ మళ్లీ కాంగ్రెస్ ఆమోదం పొందాల్సి ఉంటుంది. 'తాజాగా వారు అనుకొన్నచోట్ల డ్రిల్లింగ్ చేస్తే.. కోలుకోలేనంత నష్టం వాటిల్లుతుంది. వాస్తవానికి అమెరికా ఇంధన అవసరాలను తీర్చుకోవడానికి అది అనవసరం. రిస్క్ చేయాల్సినంత విలువైందేమీ కాదు. ఇప్పటికే దేశంలోని పలు ప్రాంతాలను వాతావరణ మార్పులు ప్రభావితం చేస్తున్నాయి. మనం క్లీన్ ఎనర్జీ ఆర్థికవ్యవస్థ దిశగా అడుగులు వేస్తున్నాం. ఈ తీరాలను మన పిల్లలు, మనవళ్ల కోసం సంరక్షించి తీరాల్సిందే. కాలిఫోర్నియా నుంచి ఎ÷-లోరిడా వరకు రిపబ్లికన్లు, డెమోక్రట్ గవర్నర్లు, కాంగ్రెస్ సభ్యులు, తీరప్రాంత ప్రజలు ఏకతాటిపైకి వచ్చి చమురు, సహజవాయు డ్రిల్లింగ్ నుంచి తీరాలను రక్షించడానికి ఏకతాటి పైకి రావాలి' అని జోబైడెన్ పిలుపునిచ్చారు. దీనిపై ట్రంప్ కార్యవర్గంలోని ప్రెస్ సెక్రటరీగా బాధ్యతలు స్వీకరించనున్న కరోలైన్ లెవిట్టీ స్పందిస్తూ.. దీనిని అమెరికా ప్రజలపై అవమానకర ప్రతీకార చర్యగా పేర్కొన్నారు. చమురు వెలికితీతలో బైడెన్ విఫలమయ్యారని అభివర్ణించారు.




## నెరవేరబోతున్న రైల్వేజోన్ కల

- నేడు ప్రధాని మోడీ శంకుస్థాపన

**విశాఖపట్టణం,జనవరి7(ఆర్ఎన్ఎ):** రైల్వే శాఖకు సంబంధించి రాష్ట్ర ప్రజల చిరకాల వాంఛ నెరవేరబోతోంది. ఏళ్లుగా ఊరిస్తున్న దక్షిణ కోస్తా రైల్వేజోన్ ఏర్పాటుకు కీలక ముందడుగు పడింది. విశాఖ కేంద్రంగా జోన్ కార్యాలయం నిర్మాణానికి భారత ప్రధాని నరేంద్ర మోడీ శంకుస్థాపన చేయనున్నారు. వందేళ్ల చరిత్ర కలిగిన విశాఖ కేంద్రంగా వాల్తేర్ డివిజన్ తో కూడిన జోన్ ఏర్పాటు అనేది డిమాండ్. విభజన చట్టం 13వ షెడ్యూల్లో ఇచ్చిన హామీ మేరకు 2019 ఫిబ్రవరిలో కేంద్ర ప్రభుత్వం దక్షిణకోస్తా రైల్వేజోన్ ప్రకటన చేసింది. ప్రస్తుతం ఉన్న గుంతకల్లు, గుంటూరు, విజయవాడ డివిజన్లతో కలిపి జోన్ ను ఏర్పాటు చేయబోతున్నట్లు వెల్లడించింది. వాల్తేర్ డివిజన్ ను రెండు భాగాలుగా విభజించి విజయవాడ డివిజన్‌లో విలీనం చేయాలని.. మిగిలిన భాగాన్ని తూర్పు కోస్తా రైల్వేజోన్ పరిధిలోని రాయగడ కేంద్రం కొత్త డివిజన్ ఏర్పాటుకు నిర్ణయించింది. ఈ పక్రియలో రాయగడ డివిజన్ రూపుదిద్దుకోగా వాల్తేర్ మనుగడ మీద క్లారిటీ లేదు. జోన్, డివిజన్ కొనసాగించడం ద్వారానే ఆశించిన ప్రయోజనాలు సాధ్యం అంటున్నాయి రైల్వే యూనియన్ లు. మొత్తంగా ఎట్టకేలకు రైల్వేజోన్ కల సాకారం అవుతుండగా.. ప్రధాని మోడీ చేతులు మీదుగా శంకుస్థాపన జరుగుతుండటం రాజకీయ వర్గాల ఆసక్తిని రెట్టింపు చేసింది. విశాఖలోని ముడసర్లోవ దగ్గర రైల్వేకు కేటాయించిన భూముల్లో జోనల్ హెడ్ క్వార్టర్ సముదాయం రూపుదిద్దుకోనుంది. ఇక్కడ రైల్వేశాఖకు 52 ఎకరాల స్థలం ఉండగా, సుమారు పదెకరాల్లో కొత్త భవనాలు వస్తాయి. 149 కోట్లతో 9 అంతస్తుల్లో భవనాలు నిర్మాణం కోసం టెండర్ల పక్రియను ప్రారంభించింది రైల్వేశాఖ. వాస్తవానికి దక్షిణ కోస్తా జోన్ పక్రియ వైసీపీ ప్రభుత్వ హయంలోనే ప్రారంభమైనప్పటికీ భూ కేటాయింపుల్లో జాప్యం జరిగిందని రైల్వే వర్గాలు చెబుతున్నాయి. ముడసర్లోవలో ప్రతిపాదించిన భూములు రిజర్వాయర్ క్యాచ్ మెంట్ ఏరియాకు దగ్గరగా వుండటం, సాగు చేసుకుంటున్న రైతుల నుంచి అభ్యతరాలు రావడం కారణం. కూటమి ప్రభుత్వం అధికారంలో కి వచ్చిన తర్వాత జోన్ భూములపై వున్న అడ్డంకులను తొలగించేందుకు చర్యలు చేపట్టింది. చినగదిలి మండలం ముడసర్లోవలో 52.22 ఎకరాలు కేటాయించింది. గత ఆగస్టులో ఆ భూమిని రైల్వేకు అప్పగిస్తూ ప్రొసీడింగ్స్ ఇచ్చింది. మ్యుటేషన్ ద్వారా రైల్వేశాఖకు భూమి ఇచ్చినట్లు రెవెన్యూ రికార్డుల్లోనూ నమోదైంది. ఉత్తరాంధ్ర అభివృద్ధికి రైల్వేజోన్ మైల్ స్టోన్ అవుతుందని ప్రభుత్వం చెబుతోంది.. రైల్వే జోన్ కోసం భూముల కేటాయింపులో జాప్యం కారణం అవ్వడం పై అధికార, విపక్షాల మధ్య డైలాగ్ వార్ నడుస్తోంది. గత ఏడాది జనవరిలోనే తమ ప్రభుత్వం క్లియరెన్స్ ఇచ్చిందని.. అదే భూముల్లో జోనల్ కార్యాలయం నిర్మాణం చేస్తూ విమర్శలు చేయడం కరెక్ట్ కాదంటోంది వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ.. ఈ వ్యవహారం పక్కన పెడితే.. తూర్పు కోస్తా రైల్వే జోన్ లో వాల్తేర్ డివిజన్ ప్రస్థానంపై అనేక అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

## గరికపాటిపై అభ్యంతరక ప్రచారాలు

### చట్టప్రకారం చర్యలు తప్పవని బృందం హెచ్చరిక



**హైదరాబాద్,జనవరి7(ఆర్ఎన్ఎ):** ప్రముఖ ప్రవచనకర్త గరికపాటి నరసింహారావు వ్యక్తిగత జీవితంపై జరుగుతున్న తప్పుడు ప్రచారంపై ఆయన బృందం స్పందించింది. కొన్ని యూట్యూబ్ ఛానళు చేస్తున్న దుష్ప్రచారం ఆయన కుటుంబ సభ్యులతో పాటు అభిమాను లను కలత పెడుతోందని తెలిపింది. ఈ మేరకు గరికపాటి సోషల్ మీడియా ఖాతాలో ఓ పోస్ట్ పెట్టారు. 'ఇటీవల కొందరు వ్యక్తులు, కొన్ని యూట్యూబ్ ఛానళ్లుతప్పుడు ప్రచారంతో పరువు తీస్తున్నారు. గరికపాటిపై వారు చేసిన ఆరోపణలన్నీ నిరాధారం.. సత్యదూరం. వేర్వేరు ఘటనల్లో ఎవరెవరికో చెప్పని క్షమాపణలు చెప్పినట్లుగా పేర్కొంటూ ఆయన గౌరవానికి భంగం కలిగించేలా ప్రచారం చేస్తున్నారు. అంతటితో ఆగకుండా పారితోషికాలు, ఆస్తుల విషయంలో కూడా అసత్య ప్రచారం జరుగుతోంది. వీటన్నింటినీ మేం తీవ్రంగా ఖండిస్తున్నాం. ఈ విషయంలో తప్పుడు ప్రచారం చేసిన యూట్యూబ్ ఛానళ్లు, సంస్థలపై క్రిమినల్, పరువు నష్టం కేసులు వేస్తాం. ఇకపై అలాంటి దుష్ప్రచారం చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం' అని పేర్కొన్నారు.

# చైనా జలఖడ్గంపై దృష్టి పెట్టాల్సిందే!

చైనా ఎప్పటికప్పుడు కొత్త ఎత్తులు వేస్తూనే ఉంటుంది. పొరుగు దేశాలను గుప్పిట్లో ఉంచుకోవడం, ఎదుగుతున్న దేశాలకు ఎసరు పెట్టడం దాని లక్ష్యంగా ఉంది. కరోనాతో ప్రపంచాన్ని అతలాకుతలం చేసిన చైనా తన మనుగడ, పెత్తనం కోసం ఎంతకైనా తెగిస్తుందని రుజువు చేసింది. తాజాగా హెచ్ఎంపివి వైరస్ కూడా ఇలాంటిదే. కరోనా సమయంలోనూ తమకు సంబంధం లేదని బుకాయించింది. అలాగే ఇప్పుడీ కొత్త వైరస్‌పైనా ప్రపంచాన్ని బుకాయిస్తోంది. ఎలాంటి ప్రాణాంతకం కాదని చెబుతోంది. చైనా తన మార్కెట్ పరిధిని పెంచుకునే ప్రయత్నంలో ఎలాంటి దురాగతాలకైనా పాల్పడుతుందనడానికి ఇవి నిదర్శనాలు. ఇకపోతే ఇప్పుడు చైనాతో అతిపెద్ద ముప్పు ఏర్పడబోతోంది. భారత్, నేపాల్‌లతో చైనా తన సరిహద్దుల ముక్కోణపు కూడలికి బాగా దగ్గరగా యార్లుంగ్ జాంగ్బో నదిపైన, గంగా ఉపనదిపైన టిబెట్‌లో కొత్త డ్యామ్‌ను నిర్మిస్తున్నదని వార్తలు వచ్చాయి. ఈ వార్త కొన్ని సంవత్సరాలుగా వివిధ వార్తా పత్రికల్లో ప్రచురితమైంది. నిజానికి ఈ డ్యామ్ నిర్మాణం జరిగితే భారత్ భద్రతకు తీవ్ర ముప్పు ఉందన్న ఆందోళన వ్యక్తం అవుతోంది. ఈ క్రమంలో అలాంటిదేమీ లేదని తాజాగ ఆచైనా ప్రకటించింది. దీంతో భారత్‌కు ఎలాంటి ఉపద్రవం రాదని న మ్మబలికింది. చైనా ప్రభుత్వం బ్రహ్మపుత్రకు టిబెట్ పేరు అయిన యార్లుంగ్ జాంగ్బో నది దిగువ పరివాహక ప్రాంతాల్లో ఒక జలవిద్యుత్ ప్రాజెక్టు నిర్మాణాన్ని ఆమోదించింది. జల విద్యుత్ ప్రాజెక్టు యార్లుంగ్ జాంగ్బో నది దిగువ పరివాహక ప్రాంతంలో ఉంటుంది. హిమాలయ ప్రాంతంలో ప్రధాన ఇరుకైన లోయలో డ్యామ్ నిర్మాణం జరుగుతుంది. అక్కడ నది నాటకీయంగా మలుపు తీసుకుని అరుణాచల్ ప్రదేశ్‌లోకి ప్రవహించి, చివరగా బంగ్లాదేశ్‌కు చేరుకుంటుంది. ఆ డ్యామ్ చైనాకు నదీ ప్రవాహంపై నియంత్రణాధికారం కల్పిస్తుందని, ప్రాజెక్టు స్థాయి కారణంగా సరిహద్దు ప్రాంతాలను వరదల్లో ముంచెత్తేందుకు అవకాశం ఇస్తూ, సంక్షోభ సమయాల్లో అధిక మొత్తంలో నీటి విడుదలకు వీలు కల్పిస్తుందని భారత్ ఆందోళన వ్యక్తం చేసింది. కానీ, బ్రహ్మపుత్ర నదిపై చైనా భాగంలో డ్యామ్ నిర్మాణాన్ని ఆమోదించాలన్న తన నిర్ణయాన్ని చైనా సమర్థించుకున్నది. ప్రపంచంలోనే అతిపెద్ద డ్యామ్‌ను టిబెట్‌లో బ్రహ్మపుత్ర నదిపై నిర్మించాలన్న చైనా యోచనపై భయాందోళనలు అనవసరమని చైనా విదేశాంగ మంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి మావో నింగ్ డిసెంబర్ 27న అన్నారు.మెగా ప్రాజెక్టు దిగువ నదీ పరివాహక దేశాలను ప్రభావితం చేయదని, దశాబ్దాల తరబడి అధ్యయనాల ద్వారా వాటి భద్రత ఆందోళనలను పరిగణనలోకి తీసుకుని సరి చేయడమైందని మావో నింగ్ స్పష్టం చేశారు, 137 బిలియన్ డాలర్ల ప్రాజెక్టును టెక్టోనిక్ ప్లేట్ సరిహద్దు పొడుగునా పర్యావరణపరంగా సున్నితమైన హిమాలయ ప్రాంతంలో నిర్మిస్తున్నారు. ప్రపంచంలోని అతిపెద్ద డ్యామ్ ప్రభావం పల్లపు ప్రాంతాలపై పడదని ఆమె చెప్పారు. ఆ డ్యామ్‌ను ఉపగ్రహ చిత్రాల ఆధారంగా దిగువ ప్రాంతాలకు నీటి ప్రవాహం నియంత్రణ కు చైనా ఉపయోగించుకోవచ్చు. చైనా ప్రభుత్వ ఆధ్వర్యంలోని జిన్‌హువా వార్తా సంస్థ ఉటంకించిన అధికార ప్రకటన ప్రకారం, తుదకు 2024 డిసెంబర్ 25న అన్ని సందేహాలను పరిహరిస్తూ వెలువరించింది. ఇప్పుడు భారత్ అభ్యంతరం చెప్పడంతో అంతగా భయపడాల్సిన అవసరం లేదని అంటోంది. సీమాంతర నదుల అభివృద్ధి పట్ల చైనా ఎల్లప్పుడూ బాధ్యతాయుతంగా ఉంటున్నట్లు, టిబెట్‌లో జలవిద్యుత్ అభివృద్ధిపై దశాబ్దాల పాటు అధ్యయనం చేసినట్లు, ప్రాజెక్టు భద్రతకు, పర్యావరణ, వాతావరణ పరిరక్షణకు సముచిత చర్యలు తీసుకున్నట్లు మావో నింగ్ చెబుతున్నా నమ్మశక్యంగా లేవు. భారత సరిహద్దుకు సమీపంగా టిబెట్‌లో బ్రహ్మపుత్ర నదిపై 137 బిలియన్ యుఎస్ డాలర్లు విలువ చేసే భూగ్రహంపై అతిపెద్ద మౌలిక వసతుల ప్రాజెక్టుగా పేర్కొంటున్న ప్రపంచంలోనే ప్రతిపాదిత అతిపెద్ద డ్యామ్ నదీ పరివాహక దేశాలు భారత్, బంగ్లాదేశ్‌లలో ఆందోళనలు కలిగిస్తోంది. డ్యామ్‌పై మొత్తం పెట్టుబడి ఒక ట్రిలియన్ యువాన్లు (137 బిలియన్ డాలర్లు) దాటిపోగలదు. ప్రపంచంలోనే అతిపెద్దదిగా పరిగణిస్తున్న చైనా సొంత త్రీ గార్జెస్ డ్యామ్ సహా ఈ గ్రహంపై ఏ ఇతర ఒక్క మౌలికవసతుల ప్రాజెక్టు ఖర్చును మరుగుజ్జును చేస్తుంది. హిమాలయ పర్వత ప్రాంతంలో ఒక భారీ లోయలో డ్యామ్‌ను నిర్మించడమన్నది పొరుగున ఉన్న మనపై జలయుద్ధ ట్యాంకును ఎక్కు పెట్టడమే. కైలాస శిఖరం నుంచి టిబెట్ మీదుగా భారత్, బంగ్లాదేశ్‌లకు పేర్ల మార్పుతో ప్రవహిస్తున్న నదిపై మెగా డ్యామ్‌ల నిర్మాణం గురించి పోటాపోటీగా వ్యవహరిస్తున్నా రెండు దేశాలు సీమాంతర నదులకు సంబంధించిన వివిధ అంశాలను చర్చించేందుకు 2006లో నిపుణుల స్థాయి యంత్రాంగం ను ఏర్పాటు చేశాయి. దాని కింద వరద కాలాల్లో బ్రహ్మపుత్ర నది, స్లటెజ్ నదికి సంబంధించి జలప్రవాహ సమాచారాన్ని భారత్‌కు చైనా అందజేస్తున్నది. సరిహద్దు అంశానికి సంబంధించి భారత, చైనా ప్రత్యేక ప్రతినిధులు ఎన్ఎస్ఎ అజిత్ దోవల్, చైనా విదేశాంగ శాఖ మంత్రి వాంగ్ యి మధ్య డిసెంబర్ 18న బీజింగ్‌లో జరిగిన చర్చల్లో సీమాంతర నదుల డేటా పంచుకోవడమైంది. సీమాంతర దేశాలపై దూకుడుగా వ్యవహరించేందుకు తన డ్యామ్‌లను ఉపయోగించుకుంటున్న చరిత్ర చైనాది. ఏడాది పొడుగునా వర్షపాతంలో గణనీయమైన పెరుగుదల ఉన్నది. జూలై, సెప్టెంబర్ మధ్య గరిష్ఠంగా ఉంటుంది. బ్రహ్మపుత్ర నది రెండు అధిక నీటిమట్టం సీజన్‌లను చూస్తుంటుంది. ఈ క్రమంలో బ్రహ్మపుత్ర ద్వారా నీటిని ఒక్కసారిగా వదిలితే అది భారత్‌ను ముంచెత్తే ప్రమాదం ఉందన్న ఆందోళన వస్తోంది. దీంతో దీనిపై భారత్ గట్టిగానే వ్యతిరేకిస్తున్నా..అడ్డుకోవడమే మంచిది.